# ఇది నవతరం

టేప్ రికార్డర్‌లో పాట వస్తోంది.

'డి' సే హోతాహై 'డాన్స్'
'ఐ' సే హోతా హై 'ఐటమ్'
'యస్' సే హోతా హై 'సింగర్'
'జవానీ ఏక్ లహర్ హై...'

పాట హుషారుగా సాగుతోంది. డాన్సు చేస్తున్నాడు రవి. అతని వెనకాలే, అతనిలాగే స్టెప్పు వేయటానికి చూస్తూ, కాళ్ళకి అడ్డం వస్తూ కేకలు పెడుతున్నాడు పవన్. ఇల్లు అదిరిపోయింది పాటతో, కేకలతో, వాళ్ళిద్దరి అరుపులతో.

రామకృష్ణ గుమ్మం పట్టుకొని పది సార్లయినా అరిచి వుంటాడు.

"ఒరె...ఒరె..."

"ఏమిటీ?"

డాన్సు ఆపకుండానే తలకాయతో విన్యాసం చేశాడు రవి.

"సినిమాకు పోతున్నాంరా...."

"పొండి...పొండి"

తలవూపి అనుమతి ఇచ్చేశాడు.

"ఒరేయ్, నాకు ఒళ్ళు మండిపోతోంది. సరిగా సమాధానం చెప్పి చావరాదూ. నీకు తోడు ఆ వెధవ ఒకడు. అంత బండకేకలు పెడుతుంటిరి. ఇవతల మనిషి అరిచి చచ్చిపోయినా పట్టించుకునేది లేదా?"

"ఎందుకు చచ్చిపోతున్నావూ....?"

కళ్ళు తేలవేసి, ఆకాశం వైపు చూసి చేత్తో సంజ్ఞ చేశాడు రవి. మ్యూజిక్‌తో పాటు రవి డాన్సు స్పీడు పెరిగిపోయింది.

'టఫీ'మని శబ్దం వచ్చేలా టేప్ ఆపేశాడు రామకృష్ణ. డాన్స్ ఆగిపోయింది.

"ఏమిట్రా నీ న్యూసెన్సు. మేం సుఖంగా డాన్స్ చేసుకొందుకు కూడా నీ పర్మిషన్ కావాలా?" రవి నడుం మీద రెండు చేతులు ఆనించి యుద్ధ ప్రకటన చేశాడు.

మీ ఇద్దరూ నా ప్రాణానికి న్యూసెన్సులు. పైగా నన్నంటారా న్యూసెన్సని. నీ ఆనందం కోసం ఈ చుట్టుప్రక్కల జనాల్ని ఈ పాటలతో చావగొట్టి చెవులు ముయ్యాలన్నమాట...."

"అంటే.... అంటే - ఇలాగుంది ఈ ప్రపంచం తీరుతెన్నులు. మంచి పాట అదే సంగీతం వినరు. ఎదుటివాడి నవ్వు చూడలేరు. మంచి డాన్సు చేయలేరు. సరికదా, చూచి ఆనందించటమూ రాదు...."

"ప్రతిదీ సులభమ్ముగా సాధ్యపడదు లెమ్ము
నరుడు, నరుడౌట ఎంతో దుష్కరము సుమ్ము...."

అన్నారు మా గురువుగారు.

ఎవరు? గాలిబ్ గారు... వారే నాకు ఆదర్శం!

"ఇప్పుడు నిన్ను ఒక్క దెబ్బతో చంపేయడానికి, ఆ యమధర్మరాజు నాకు ఆదర్శం.... ఇది డాన్సా, సంగీతమా... తాగిన వెధవ పీనుగులాగా వూగిపోవడం డాన్సట, పైగా ఇది చూచి నేను ఆనందపడడం లేదట, మనిషిని గాదుట..."

"తాగిన వెధవ గురించి అంత చులకనగా వుందా నీకు,"

"పానశాల లేని దేదైన నేమి
బడి, మసీదు, సత్తరువు సర్వమ్ము నొకటె..."

ఇదంతా నీకేం అర్థం అవుతుంది. తెలుగే రాదు, ఇక గురువుగారి కవిత్వం ఏమొస్తుంది. నీ గోల ఏమిటో చెప్పు...."

అక్కడే వున్న రాజేశ్వరి సూట్‌కేస్ మీద కూర్చున్నాడు.

"నాయనా, నీ భారం అసింటా ఆ కుర్చీమీద చేరవెయ్యి నాయనా... ఆ చిన్న ప్రాణం అణిగిపోతుంది."

"ఏమిటీ... ఈ వెధవ సూట్‌కేస్ కోసం, అంత ప్రత్యేకమైన ఏడుపు.... ఇలాటివి వీధికో రెండు పారేసి వున్నాయి తెచ్చుకో పో...."

"రాజేశ్వరిది నాయనా... నాకేం, ఎల్లాగయినా తగలడు. చూసిందంటే నీ ప్రాణం తనే తీస్తుంది...."

"అమ్మో వదినగారిదా... పాపం శమించుగాక... చూస్తే మనకు కాఫీ కూడా పుట్టదు.... అవునూ, ఇంత సేపయినా నాకు కాఫీ ఇవ్వలేదూ..."

రవి హడావుడిగా వంటింట్లోకి వెళ్ళిపోయాడు. ఆవు వెనక దూడలాగా పవన్ గాడూ వెళ్ళిపోయాడు. తలపట్టుకున్నాడు రామకృష్ణ. అసలు వీడి బుర్రలోకి ఏదైనా ఎక్కించాలంటే ముందు మన బుర్ర ఖరాబైపోతుంది కదా...'

※ ※ ※

వంటింట్లో రాజేశ్వరి గిన్నెలతో యుద్ధం చేస్తోంది.

"వదినా, నాకు కాఫీ....."

రవి గడప మీద కూర్చున్నాడు.

"నాయన్నాయనా... నీకు పుణ్యం వుంటుంది. దొడ్లోకి పోయి, ఆ గిన్నె నిండా నీళ్ళు తెచ్చిపెట్టు. అన్నం పొంగిపోతోంది. పప్పులో నీళ్ళు లేవు... రవీ...రవీ..."

రవి లేచి ఒక పెద్ద నిలువు గిన్నె అందుకున్నాడు. రాజేశ్వరి వెనక్కు తిరిగి చూచి కెవ్వుమంది.

"అయ్యయ్యో ... అది కొత్త గిన్నె. అయినా అంత గిన్నెతో నీళ్ళు తెచ్చి ఎక్కడ పోస్తావూ... పప్పులో నీళ్ళు పోయమంటే...."

"ఓ......ఐ.సీ..." ఆ గిన్నె అక్కడే పడేశాడు.

"అయ్యయ్యో, అంత ఎత్తుగా పెట్టి వదిలేస్తావూ... గిన్నె చొట్టలు పడిపోయి వుంటుంది. అసలీ పిల్లాడికి పని చెప్పటం నాదే బుద్ధి తక్కువ. చేతిలో అన్నం

వుండిపోయింది....” రాజేశ్వరి విసుక్కుంది.

“సరే.....సరే.....పోనీ....”

రవి పోయి గ్లాసు నిండా నీళ్ళు తెచ్చి పప్పులో పోసేశాడు.

రాజేశ్వరి మళ్ళీ కెవ్వుమంది. “అన్ని నీళ్ళా పోసేది...” అని.

“ఇప్పటికి మూడుసార్లు ‘బేర్’మని నేను దడుచుకునేటట్లు అరిచావు. అసలు నేనేం చేసినా నీకు నచ్చదు..” కోపంగా మొహం పెట్టాడు రవి.

“మరి అన్ని నీళ్ళు పోస్తే ఏం చేయమంటావు. నీకు టిఫిన్ పెడతాను గానీ తిని దయచేయి ఇక్కడ నుంచి”

“ఆ టిఫిన్ తినబోతున్నావూ.. ఇక నిన్ను ఆ పెరుమాళ్ళే రక్షించాలి” రామకృష్ణ అన్నాడు.

రాజేశ్వరి గయ్‌మంది.

“ఏమయింది ఆ టిఫినుకి. చూట్టానికి కొంచెం నల్లగా వున్నాయి కానీ కేక్స్ టేస్టీగానే వున్నాయి”

ప్లేట్లో పదార్థం రంగు చూసి రవి చిన్న గంతుతో వంటింట్లోంచి బయట పడ్డాడు.

“మరీ బడాయి. కేకులు చేద్దామని మొదలు పెట్టాను. మామూలు పెనంమీద అయేసరికి మాడిపోయింది. అదేగనుక ఓవెన్ వుంటేనా ఫస్ట్‌క్లాస్‌గా వస్తాయి కేక్స్....”

“నీ ప్రయోగాలు మీ ఆయన మీద చేసుకో తల్లీ. వాడిది కాస్త భారీ శరీరం కాబట్టి తట్టుకుంటాడు. నన్ను మటుకు వదిలేయి. మీరు సినిమాకు పోతే నేను బయట రూమ్‌లో పడుకొంటాను. కీస్ మటుకు ఇచ్చిపో. పవన్‌గాడు, నేనూ బజార్లో ఏదన్నా తిని వచ్చి పడుకుంటాం....”

రాజేశ్వరికి రిలీఫ్ వచ్చింది.

“అమ్మయ్య, పవన్‌గాడి గొడవ లేకపోతే సినిమా హాయిగా ఎంజాయ్ చేయవచ్చు. రవీ, నీకు ఫస్ట్‌క్లాసయిన కాఫీ ఇచ్చుకుంటాను...”

రాజేశ్వరి లోపలకి వెళ్లిపోయింది.

‘కీ’ చైన్‌లోంచి డూప్లికేట్ ‘కీ’ తీసి ఇచ్చాడు రామకృష్ణ.

“ఏమిటీ విశేషం? అమ్మ లేదా...”

రవి తల్లి యశోదమ్మ ఇంట్లో లేకపోయినా, రవి అక్కయ్య మనోరమ ఇంటికి పోయినా, బోర్‌గా వుందని రామకృష్ణ ఇంటికి వచ్చి బయట రూమ్‌లో పవన్‌తో పాటు పడుకోవటం రవికి అలవాటే.

"అమ్మెందుకు లేదూ... విశేషం లేదనుకో.... మా జి.యం. వచ్చాడు వుదయం." రామకృష్ణ నవ్వాడు.

"వస్తే ఏమిరా...? ఆయన పాపం మంచివాడే... నీకెందుకు సరిపడదో. మనోరమ రాలేదూ..."

"వచ్చింది.... అదెక్కడ రెండుసార్లు వూపిరి పీల్చేస్తుందో అని ఆయన అనుమానం. అందుకే బాడీగార్డులా వచ్చేశాడు..."

"వూరుకోరా... నువ్వు మరీ చెప్తావూ... రేపు నేను వస్తాను ఇంటికి. బావగార్ని పలకరించాలి. మనోరమ బావుందా?"

కాఫీ తీసుకు వచ్చింది రాజేశ్వరి.

"వదిన వచ్చిందా? రేపు నేను వస్తాను. అమ్మతో చెప్పు, నాకూ వంట చేయమను."

"ఇంతకీ వంట ఎలా ఎగ్గొట్టాలా అనే ఆలోచిస్తుంటావు.." రామకృష్ణ నెక్కిరించేడు.

"మరే, మీరేమన్నా కష్టపడతారా ఏమన్నానా... రవీ. బయట ఏం తినద్దు. రాగానే భోజనం చేద్దాం. వంట చేసేశాను..."

"ఒ.కె...ఒ.కె." వప్పేసుకున్నాడు రవి.

"ఇంతకూ అమ్మకు చెప్పేవా? నీకోసం చూస్తుందేమో?"

"చెప్పేం.... చెప్పేం. అయినా, మా జి.యం. వస్తే రాత్రిళ్ళు నేను ఇంటికి రానని తెలుసులే.... మనూని సతాయిస్తుంటాడు. చూడాలన్నా మనకి బాధే..."

"జి.యం. ఏమిటిరా... బావా అనలేవూ....?"

"ఏమిటి తన జనరల్ మేనేజర్ హోదా అంతా మనమీద చూపిస్తే విసుగేయదూ.... వళ్ళు మండుతుంది."

చిన్నతనం నుంచీ రవికి అభిమానం ఎక్కువే. తండ్రి పోయిన దగ్గర నుంచీ ఇంటి బాధ్యత భుజాల మీద వేసుకునేసరికి పెద్దరికం దానంతట అదే వచ్చింది. తల్లి బాధ్యత, మనోరమ బాధ్యత అతన్ని కృంగదీశాయి. అవసరం వున్నప్పుడు సాటి మనిషిగా ఆదుకోకపోయినా పెత్తనం చేస్తుంటే వళ్ళు మండుతుంది మాధవరావును చూస్తే. విసుక్కునేందుకు లేదు. ఎక్కడ తను నొచ్చుకుంటాడో, ఎక్కడ ఆ భర్తకు కోపం వస్తుందోనని భయంతో చూసే మనోరమను చూచేసరికి, అతని నోటికి తాళం పడిపోతుంది.

"ఏమిటి ఇంత హడావుడిగా ఇద్దరూ వచ్చారు...సెలవులు లేవుగా...."

"అబార్షన్..."

" మళ్ళీనా..."

"దాని ఖర్మ..... మనిషి శవంలా తయారయింది. అమ్మ గొల్లుమని ఏడ్చింది దానిని చూసి. కనీసం రెండు నెలలు రెస్టు తీసుకోవాలన్నారట డాక్టరు. ఇక్కడ వదలిపెట్టడానికి తీసుకొచ్చేడు."

రాజేశ్వరి తయారయి వచ్చింది.

"మరి పోదామా....?"

"నాదేం ఆలస్యం లేదు. ఏరా పవన్ వస్తావా? బాబాయి దగ్గర వుంటావా?"

"బాబాయితో వుంటా..."

వాణ్ణి ఎగరవేసి ముద్దు పెట్టుకున్నాడు రవి.

"తాళం వేయండి. వీణ్ణి కాసేపు బజారులో తిప్పి తీసుకువస్తాను."

వాళ్ళిద్దరూ రిక్షాలో ఎక్కేదాకా వుండి, ఓవర్ బ్రిడ్జివేపు నడిచాడు రవి. నియాన్ లైట్స్ కాంతితో పట్టపగలుగా వుంది. దూరంగా స్టేషన్‌లో లైట్లు దీపాల తోరణంలాగా వున్నాయి. వూరు కనబడుతోంది కొంతదూరం వరకు. దూరాన వున్న లైట్లు చూచి కేరింతలు కొట్టేడు పవన్.

"వీడెంత హాయిగా నవ్వుతాడో.." మనోరమ గుర్తు వచ్చింది. తెల్లగా పాలిపోయి, శవాకారంలాగా వుంది.

"పిల్లలంటే అంత మమకారం దేనికో. ఈ ఆడవాళ్ళు సెంటిమెంటల్ ఫూల్స్. అమ్మ మొత్తుకుంటోంది. 'గర్భకోశం వీక్‌గా వుందిరా... బిడ్డను మోసే శక్తి లేదట. అందుకే ఎబార్షన్స్ కావటం. దాని బాధ చూడలేం. ఏం పిల్లలో, వెధవ పిల్లలు. పిల్లలు లేకపోతే ఏం?' అమ్మ అలా అంటే మనోరమ వూరుకుందా. ఎంతసేపు గొడవపెట్టుకుంది. ఎక్కడో పిచ్చిది...'

రవి నిట్టూర్చేడు.

* * *

"అమ్మా.... వీడు రాడా..."

మనోరమ అడిగింది.

"ఏవోనే. రావుడి దగ్గరకు పోయి వుంటాడు. అక్కడే పడుకుంటాడు. తొమ్మిదయింది, ఇంకేం వస్తాడు."

"ఎందుకు వేరే వాళ్ళ ఇళ్ళకు వెళ్ళి వాళ్ళకు ఇబ్బంది కలిగించడం, ఏం చుట్టాలు..." మాధవరావు అన్నాడు.

మనోరమ కోసం హార్లిక్స్ కలుపుతున్న యశోదమ్మ నొచ్చుకుంది.

"అట్లా కాదులే నాయనా. వాడికి చిన్నతనం నుంచీ స్నేహం రావుడితో. వాళ్ళు పరాయిగా వుండరు. ఆ పిల్ల రాజేశ్వరిని చూడలేదూ నువ్వు.. నాకు కొంచెం బావుండకపోయినా పరుగెత్తుకు వస్తుంది. రావుడికి తల్లి లేదు, తండ్రి పల్లెలో వుంటాడు. వ్యవసాయం వుంది అతనికి..."

రావుడంటే మెకానిక్ షాప్ అతను కదూ... గుర్తు వచ్చిందిలే. అయినా, ఎవరు ఎక్కడ వుండాలో అక్కడే వుండాలి."

యశోదమ్మ మాట్లాడలేదు. మనోరమ భర్తవేపు భయంగా చూచింది.

"మీకెందుకు ఎవరిష్టం వారిది." అనే ధైర్యం లేదు ఆమెకు.

నిస్సహాయంగా తల్లివేపు చూసింది మనోరమ.

"కాదులే నాయనా, అతను మెకానిక్ షాప్ పెట్టుకొన్నా స్వంత షాపే, మరీ దరిద్రులేం కాదు. పొలాలు వున్నాయి. తండ్రి ఓపిగ్గానే వున్నాడు. పల్లెలో వ్యవసాయం చేయించుకొంటాడు."

స్వంత మేనల్లుడే అయినా, మాధవరావుని ఏమనేందుకూ యశోదమ్మకు ధైర్యం చాలదు. భర్త పోయాక అన్న ఆదుకుని చూడకపోయినా, తీర్చిదిద్దిన ప్రతిమలాగా వున్న మనోరమను మటుకు మాధవరావు వదులుకోలేదు. అప్పటికే ఎం.బి.ఎ., చదువుతున్నాడు. మంచి కట్నం వస్తుందని తల్లి, తండ్రి ఆశ పెట్టుకొన్నా మనోరమనే చేసుకున్నాడు అతను. అలా అని, అత్తగారి లేమితనం అన్నా, బావమరిది చిన్నవాడనీ ఎలాంటి జాలి, సానుభూతి లేవు. పైగా రవి లారీ సప్లై ఆఫీసులో పని చేస్తాడని కోపం. కానీ, అతనికి వేరే మంచి వుద్యోగం చూపేంత మంచి మనసు మటుకు లేదు. అసలా ఇంటికి రావడమే ఎలర్జీ అతనికి. తప్పదు మరి. అబార్షన్‌తో మంచం పట్టే మనోరమకొరకైనా అత్తగారి సేవలు స్వీకరించక తప్పదు. "మన అవసరం అయితే తప్పేదేముందీ?" అదీ అతని సిద్ధాంతం. రవికి వళ్ళు మండుతుంది అతని మాటలు వింటుంటే. అందుకే సాధ్యమైనంత వరకు అతని ఎదురుగా రాకుండా వుండడమే బావుంటుంది అతనికి.

"అమ్మా, నునూ నిద్రపోయిందా?"

తమ్ముడి గొంతు విని కళ్ళు తెరిచింది మనోరమ. ఇద్దరికీ వయసులో పెద్ద తేడా లేదు. సంవత్సరంన్నర పెద్ద మనోరమ. ఇద్దరికీ పేర్లతో పిలుచుకొనే అలవాటే చిన్నప్పటి నుంచీ.

'రవీ' అంది చిన్నగా.

"నువ్వు నిద్రపోలేదూ?" వచ్చి మంచం మీద కూర్చున్నాడు రవి. చేతిలో వున్న గ్లూకోజు, పండ్లు టేబిల్ మీద వుంచేడు.

"పండ్లు వున్నాయిరా మళ్ళీ ఎందుకు తెచ్చేవు?" అన్నది మనోరమ రహస్యంగా.

భర్త వింటాడని భయం. తండ్రిపోయాక, డిగ్రీ చదువు మధ్యలో మానేసి ఈ ఇంటి బాధ్యత భుజాల మీద కెత్తుకున్న తమ్ముడంటే పట్టరాని అభిమానం మనోరమకు. ఉద్యోగం దొరికేదాకా వాళ్ళు ఎంత ఇబ్బంది పడినా చూస్తూ వుండిపోయింది. ఆర్థిక స్వాతంత్రం లేకపోతే అన్ని స్వతంత్రాలు లేనట్టే కదా! ఈ దేశంలో భార్య పాత్ర ధరించిన ఏ ఆడపిల్లయినా సరే నిస్సహాయురాలే.

"ఎంత చిక్కిపోయావో...." ఆమె చేయి తన చేతిలోకి తీసుకున్నాడు రవి. అసలే తెల్లగా వుండే మనోరమ మరీ పాలిపోయింది.

యశోదమ్మ వచ్చింది లోపలి నుంచి.

"ఏవిరా, రాత్రి నుంచీ పత్తా లేవూ. ఉదయం కాఫీకి కూడా రాలేదూ? పొద్దుటి నుంచీ మనూ అడుగుతూనే వుంది. అన్నం పెట్టేదా... రెండు కావస్తోంది."

"పెట్టు... పెట్టు... కాళ్ళు కడుక్కొని వచ్చేస్తాను. ఉదయం వదిన ఇడ్లీలు చేసింది. హెవీగా తిన్నా. అసలు ఆకలి లేదు."

"రాజేశ్వరి బావుందిరా" అన్నది మనోరమ.

"ఓ.... వస్తుంది. రామకృష్ణ వస్తానన్నాడు. మరిచిపోయా చెప్పడం – అమ్మా! అన్నం వుందా? వాళ్ళిద్దరూ తిండికి ఇక్కడికే వస్తానన్నారు."

"నాకు కలేమయినా వస్తుందిటరా వాళ్ళు వస్తారని. రానీ, వాళ్ళ కోసం ఏం చెయ్యాలని, కాస్త అన్నం మటుకు వండుతా..."

"ఏదో కానీ.. నాకు ముందు పెట్టు. నేను పోతాను."

మాధవరావు లేచేడు మాటలు విని.

"ఏవోయ్ ఎప్పుడు రాక, రాత్రి రాలేదే?"

"మాఫ్రెండ్ బలవంతం చేస్తేను వుండిపోయా?"

యశోదమ్మ గొణుగుతోంది.

"రాత్రి లేదూ, పగలు లేదూ, ఒక వేళపట్టున రానే రాడు మనూ, వీడు నన్ను చంపుతుంటాడే. నిద్రపట్టున లేపేస్తాడు. తలనొప్పి వస్తోంది నాకు."

"అమ్మనలా ఇబ్బంది పెట్టకపోతే, పెండ్లి చేసుకోరాదురా" హాస్యంగా అన్నాడు మాధవరావు.

"సంబంధం చూచేవా?"

మాధవరావు దెబ్బతిన్నాడు ఆ సూటి ప్రశ్నకు.

"ఏం చూడాలోయ్, నువ్వో ది గ్రేట్‌వి. నీకెలాంటి అమ్మాయి కావాలో నాకేం తెల్సు."

"మరింకేం తెలియకపోతే వూరుకోండి. నేను చూడమన్నానా...."

"ఏమిట్రా ఆ మాటలు, బావతో మాట్లాడేది అలాగేనా. వాడి మాటలకేమిలే నాయనా. వీడి పెండ్లి అయిపోతే నా బాధ్యత తీరినట్టే"

"మా ఇంటి ప్రక్కనే లక్ష్మణరావుగారని ఒకాయన వున్నారు. మేష్టారు. ఆయనకు ఆడపిల్లలు వున్నారు. మనూ, వాళ్ళమ్మాయికి పెండ్లి కాలేదు కదూ?"

"కాలేదండీ" అంది వినయంగా మనోరమ.

"మీరేం కష్టపడి వెతకనక్కరలేదుగానీ, నేనేం చేసుకోను."

"చేసుకోక ఏం చేస్తావ్?..."

"కాశీకి పోయి సన్యాసం పుచ్చుకొంటా, అమ్మా, నాకు తిండిపెడతావా? నేను వెళ్ళిపోయేదా?"

"అయ్యో అవేం మాటలురా, నీ కోసమే నిలుచున్నా..."

* * *

"ఠండీ హవాయే, లహరాకే ఆయే – కైసే బులాయే"

మౌత్ ఆర్గన్ మీద పలికిస్తూ లోపలికి వచ్చాడు రవి. రెండో చరణం సరీగా పలకలేదనిపించింది. ఒక్కక్షణం ఆపి పాటను నోటితో పాడి చూచుకొని, మళ్ళీ ఆర్గన్‌తో పలికించి చూచేడు.. చిటిక వేసి తల ఎత్తేసరికి ఎదురుగా...

అప్పుడు చూచేడు ఆ అమ్మాయిని. కిటికీ ప్రక్కగా వున్న ఛెయిర్‌లో కూర్చుని నవ్వు ఆపుకొంటోంది బలవంతంగా. హఠాత్తుగా అలా చూచేసరికి కంగారుపడిపోయాడు. ఎవరీ అమ్మాయి. తను పొరపాటున ఎవరి కొంపకో వెళ్ళిపోలేదు కదా ఖర్మ... చుట్టూ చూచేడు. రామకృష్ణ ఇల్లే....

"నేనూ.... నేను... ఒరేయ్, రామం... వదినా...వదినా...." ఒక్క పరుగుతో లోపలికి వెళ్ళిపోయాడు రవి. వంట ఇంట్లో వుంది రాజేశ్వరి.

"ఎవరొదినా గదిలో.."

"ఎప్పుడొచ్చావు రవీ... అదా.... లలిత.... మా పిన్ని కూతురు. ఇక్కడ కాలేజీలో చదివేందుకు వచ్చింది. సీటు దొరుకుతుందో, దొరకదో"

రవి అప్పటికి స్థిమితపడ్డాడు. ఒక్కసారిగా ఆడపిల్లను ఆ గదిలో చూచేసరికి కంగారయిపోయింది అతనికి.

అతనికి కాఫీ ఇస్తూ....

"రవీ, లలితకు ఇక్కడ సీటు దొరుకుతుందా... వీలుంటే ఉమన్స్ కాలేజీలో..."

"ఉమన్స్ కాలేజీ సంగతి నాకు తెలియదు గానీ, కో ఎడ్యుకేషన్ కాలేజీ వుంది కదా, ఆ కాలేజీ మెంబర్సులో ఒకాయన లారీ యూనియన్ ప్రెసిడెంట్, ఆయన మటుకు తెలుసు"

"ఇప్పటికి కాలేజీలు తెరిచి పది రోజులయింది కదా! దొరుకుతుందా సీటు."

"ఆ భారం నాకు వదులు. ఆయన ఫోన్ చేస్తే చాలు. పైగా ఆ హాస్టల్‌కు రైస్ సప్లయి చేసేది కృష్ణ పనిచేసే మెకానిక్ షాప్ ఓనర్ కోటిగాడే... బండ...

రామకృష్ణ వింటుండగా, కోటయ్యను కోటిగాడు, బండ అంటే వూరుకోడు. 'మనకు ఏం అపకారం చేశారని' పోట్లాడుతాడు. అయినా రవి అనకమానడు. రాజేశ్వరి నవ్వింది.

"ఆయనతో మర్యాదగానే మాట్లాడుతుంటావే, మొన్న ఇంటికి వస్తే బండ, మొద్దు, అనలేదే..."

"సరేలే తిడితే వూరుకొంటాడూ, వాడు బండలాగా వుంటాడు కాబట్టి అంటాం. ఇంతకీ మనకి సీటు ముఖ్యం."

"మరే! ఇవాళే వెళతారా, లలితను తీసుకొనిపో."

'అమ్మో.... నేనా...."

"మరి! అన్నయ్యకు ఎక్కడ తీరిక. ఆదివారాలు తప్పితే. నీకే చెప్పమన్నాడు."

"ఆడవాళ్ళతో ఇబ్బందిగా వుంటుంది వదినా....ఫ్రీగా వుండదు." రవి గొణుగుతుండగానే కేకవేసింది లలితను.

"వస్తున్నా అక్కా....."

ముందుగా పట్టు పరికిణీ కనబడింది రవికి. పచ్చని పాదాలకి గోరింటాకు, గడప దాటుతుంటే కాళ్ళకు పట్టాలు మెరుస్తూ కనిపించాయి.

"నీ సర్టిఫికెట్స్ అన్నీ సర్దుకో. రవితో వెళ్ళు. ఇందాక బావ చెప్పలే, రవి అని... ఇతనే..."

దీక్షగా కాఫీ కప్పునే చూస్తున్న రవి తలెత్తి చూచాడు.

తననే చూస్తున్న జంట చేపల్లాంటి నల్లని కళ్ళు ముందుగా కనబడ్డాయి. ఎర్రని పెదవులు నవ్వుతో సగం విచ్చుకొన్నాయి. సన్నని సూది ముక్కు చివర ఒంటిరాయి పుడక తళుక్కున మెరిసింది. సన్నగా, పొడుగ్గా శంపాలతలాగా వుంది లలిత. ఆ అమ్మాయి తల వంచుకొని కళ్ళెత్తి చూస్తోంటే, గుండె గబగబా కొట్టుకొంది రవికి.

చప్పున తలపంచుకున్నాడు.

'ఎంత అందంగా వుంది....'

"ఆటోలో వెళ్ళండి రవీ. త్వరగా వెళ్ళవచ్చు..."

※ ※ ※

లలితతో కలిసి ఆటోలో వెడుతోంటే గాలిలో తేలిపోతున్నట్లుగా వుంది రవికి. రోజూ చూచే బజారు, ఏదో హడావుడిగా సంతోషంగా వున్నట్లుంది.

"మా వూరు పల్లెటూరు కదూ. ఇంత జనం సందడీ వుండదు" నోరు మూసుకొని కూర్చోడమంటే లలితకు విసుగు.

"మరీ పల్లెటూరా..." అన్నాడు రవి. ఆడపిల్లకు వున్న చొరవ తనకు లేనందుకు విచారిస్తూ.

"అమ్మో, చిన్నగా అంటారేమిటి. పరమ పల్లెటూరు. ఇక్కడికి నాలుగు మైళ్ళు. అసలు ఇంత బజార్లే వుండవు. మొన్నీమధ్యే కరంటు వచ్చింది."

"దగ్గరలో కాలేజీ లేదా?"

ఇదే దగ్గర. రోజూ పోయి రావచ్చు. బస్ వుంది కానీ ఇబ్బంది. వేళకు బస్‌లు వుండవు. ఏదన్నా హాస్టల్‌లో వుండాల్సిందే.... భయంగా వుంది ఒక్కదాన్ని వుండాలంటే..."

"ఏం భయం హాస్టల్లో మీరొక్కరే వుంటారనుకొంటున్నారా?"

"కాదనుకోండి, కొత్తగా వుంది..."

"ఏం ఫరవాలేదు, మీ అక్కయ్య ఇక్కడే వుంది కదా. రెండు రోజులకొకసారి వచ్చి చూడవచ్చు. పోనీ, మీ అక్క దగ్గరే వుండచ్చు కదా...."

"వుహు.... అక్క దగ్గర వుండను. నాకు ఫ్రీగా వుండదు."

※ ※ ※

కాలేజీలో సర్టిఫికెట్స్ చూపించారు. ఆఫీసులో ఇచ్చేయమని చెప్పారు. ఫారం పూర్తిచేస్తుంటే అడిగారు రవి ఎవరని... లలిత తలయెత్తి రవి వంక చూచింది. రవి ఆదుర్దాగా చూస్తున్నాడు. ఏం చెపుతుందా? అని.

"మా అంకుల్..."

రవి హృదయం లయ తప్పింది ఒక్క క్షణం. 'అంకుల్'- వద్దన్నా ఆగని చిరునవ్వు పెదవుల మీదికి వచ్చింది.

లలిత నవ్వుకొంటూ ఫారం పూర్తిచేస్తోంది. పొడవాటి జడ భుజం మీదగా క్రిందకు జారింది.

ఈ అందమైన పిల్ల తనను 'అంకుల్' అని చెప్పింది. రవికిఎగిరి విజిల్ వేసి డాన్సు చేయాలనిపించింది.

❋ ❋ ❋

వెయిటింగ్ ఛార్జి ఇస్తానన్నా ఆటోవాడు వుండలేదు. మీల్స్ చేయాలని వెళ్ళిపోయాడు.

"ఇక్కడ రిక్షాలు కూడా దొరకవు. కొంచెం దూరం నడవాల్సిందే"

"పదండి, ఏం చేద్దాం అంకుల్...." లలిత, కిలకిల నవ్వింది. రవి నవ్వాడు.

"ఏం చేయమంటారు... మరి, మా బావ ఫ్రెండ్ అని అంటే బావుండదని అలా అన్నాను..."

"వారం రోజల నుంచీ నా సర్వీసే సరిపోయింది మీకు. పాపం.... నా మూలంగా ఇబ్బంది..." అన్నది లలిత.

"వారం రోజుల సంగతి సరేగానీ, ఇవాళమట్టుకు ఈ బుట్టలు, పేకెట్లు మోసినందుకు పది రూపాయలు ఇచ్చుకోవాలి నాకు... ఇకపోతే ఒక సైకిల్ కొనిచ్చుకోవాలి మీరు. ఇక ఆ బజారులోంచి నడవలేను, చుట్టూ తిరిగి వేరే రూట్‌లో కొంపకు చేరాలి కదా."

"ఎందుకు?" అన్నది లలిత ఆశ్చర్యంగా... తెచ్చిన వస్తువులు సర్దుతున్న రాజేశ్వరి పని ఆపి అతని వంక చూస్తోంది.

"మీరు బేరం చేసిన ఆ బజార్లో ఏ షాపువాడు చూచినా బజారు వెంట నడవడానికి వీలుండదు కదా. నా సంగతి సరే, సైకిలు వేసుకొని 'రయ్'మని వెళ్ళిపోయాననుకో, పాపం, మీ సంగతే దిగులు. మీ ఇద్దర్నీ గుర్తుపెట్టుకొని ఆ షాపుల వాళ్ళు మిమ్మల్ని చూడగానే కొట్లు వేసేసి పరుగెత్తకపోతే నా పేరు రవే కాదు."

"ఆ మరీ బడాయి... మరీ బేరం చేయకుండా కొంటామా ఏమిటి?"

"బేరం అంటే, పిన్నీసుకోసం కూడా గంటసేపు బేరం చేయడమా? షాపువాడి కంటె ముందు నాకు మండిపోయింది."

"ఇంటి దగ్గర నుంచీ ఏమీ తెచ్చుకోలేదు. అమ్మ అన్నీ ఇక్కడే కొనుక్కోమంది. సూట్‌కేస్ దగ్గర నుంచి హెయిర్ ఆయిల్ దాకా షాపింగ్ చేస్తిమి మరి. పాపం మిమ్మల్ని ఇబ్బంది పెట్టేము. తప్పలేదు మరి.."

లలిత నొచ్చుకొంటూ అంది.

అప్పటిదాకా మంచంమీద అడ్డంగా పడుకొని వాళ్ళను చూస్తూ కబుర్లాడుతున్న రవి లేచి కూర్చున్నాడు.

"ఛీ...ఛీ... అదేం మాట, నేను వదినను వుడికించేందుకు సరదాగా అంటే, నాకేం ఇబ్బంది, పైగా మీకే థాంక్స్ చెప్పాలి, నన్ను పిలిచినందుకు..."

లలిత తలయెత్తి చూచింది.

రవి సూటిగా లలితనే చూస్తున్నాడు. ఆ కళ్ళలో తొణికిసలాడే భావం, లలిత కళ్ళు దించుకునేలా చేసింది.

"నేను వంట చేసేదా రవీ, మళ్ళీ మీ అన్నయ్య వచ్చే వేళయింది. కొంచెం సాయం చెయ్యి, ఇవన్నీ సర్దుకొంటుంది."

రాజేశ్వరి వెళ్ళిపోయింది.

"రేపా హాస్టల్లో చేరేది."

రవికి ఎలాగో వుంది, ప్రియమైన వస్తువేదో జారిపోతున్న బాధ వుంది గొంతులో.

లలిత రవినే చూస్తోంది. తలవంచుకొని బుక్స్ సర్దుతున్నాడు బాస్కెట్‌లో.

'ఎంత చక్కనివాడు... మంచి మనసు... వారం రోజులై అతనివెంట తిరుగుతుంటే, చిన్న పొరపాటు మాటకూడా అనలేదు."

"లలితా.... నేను హాస్టల్‌కు రావచ్చునా...."

"రండి.... ఏం వస్తే...."

"నువు వెళుతుంటే నాకు ఏదోగా వుంది లలితా...."

లలిత మాట్లాడలేదు.

"కోపం వచ్చిందా లలితా..."

"లేదు.... లేదు... విజిటర్స్‌లో మీ పేరు వ్రాశానుగదా! అంకుల్ అని. ఎప్పుడయినా రండి..."

"రోజూ వద్దా...."

"రోజూనా – "

రవి లేచాడు, బుక్స్ క్రిందపెట్టేసి.

"నిజం లలితా నిన్ను రోజూ చూడాలని వుంది. నీవేమనుకున్నా సరే.." గబగబా వెళ్ళిపోయాడు రవి. లలిత అటే చూస్తూ వుండిపోయింది. రాజేశ్వరి "రవి ఏడి లలితా" అని పిలిచేదాకా అలాగే కూర్చుని వుండి ఆలోచిస్తూ.

"అయ్యో వట్టి తిక్క మనిషి, టిఫిన్ తినిపోగూడదూ?... లలితా, రవి అలా అమాయకంగా కనబడతాడు గానీ , ఎంత తెలివయినవాడని. వాళ్ళ నాన్న పోయినప్పుడు ఇంటర్ చదివేవాడట. మానేసి ఇంటి బాధ్యత తీసుకొన్నాడు. ప్రైవేటుగా కట్టి డిగ్రీ

తీసుకొన్నాడు. ఇంగ్లీషు ఎంత చక్కగా మాట్లాడుతాడనీ... ఏ పని మొదలు పెట్టినా, సాధించి తీరుతాడనుకో, నీ కాలేజీ సీటు లాగానే."

లలిత వింటూ వుండిపోయింది.

'నన్ను రోజూ చూడాలని వుందన్నాడు...' అని చెప్పబుద్ధి కాలేదు లలితకు.

*    *    *

రవి ఇంటికి వెళ్లేసరికి మనోరమ తల దువ్వుకుని ఎక్కడికో బయలుదేరుతోంది.

"ఎక్కడికి మనూ.... వెళ్ళిపోయాడా, జి.ఎం." లోపలికి తొంగి చూచాడు రవి.

"ఆహా...." మనోరమ నవ్వింది.

హాస్పిటల్‌కు వెళ్ళాలి రవీ, ఇంజక్షన్స్ చేయాలన్నారు డాక్టర్.

"రవీ, కొంచెం తోడుగా వెళ్ళరాదూ నువు... ఒక్కతే వెళతానంటోంది. నేను మడిలో వున్నానురా..." అన్నది యశోదమ్మ.

ఆమెకు నిత్య దీపారాధనలు, కార్తీక, మాఘ స్నానాలు, ఏకాదశి సోమవారాలు, ఇలా నిత్యం ఏదో రకం దేవతార్చనలు వుంటూనే వుంటాయి. చన్నీళ్ళతో స్నానాలు చేసి, ఆస్తమా పట్టుకొన్నా దేవుణ్ణి మాత్రం వదల్లేదు.

"వాడు తిరిగి తిరిగి వచ్చుంటాడు. ఎందుకులే నేను పోగలను..." అన్నది మనోరమ.

"ఆ హాస్పిటల్ ఇక్కడే కదా. రా పోదాం..." అన్నాడు రవి.

"నడవగలవా...."

తల వూపింది మనోరమ. అస్తమానం పడుకొని వుంటే విసుగ్గా వుంది ముందు. ఇంటికి హాస్పటల్‌కు మధ్యలో ఓవర్ బ్రిడ్జి వుంది. బజారు పొడుగునా షాప్‌లు వున్నాయి.

"హలో.... మనూ..... ఎప్పుడొచ్చావే...."

వెనక నుంచి కేకతో ఇద్దరూ ఆగిపోయారు. షాపులోంచి పాకెట్లు పట్టుకొని వస్తోంది వనజ. హైస్కూలులో ఇద్దరూ క్లాస్‌మేట్లు. "ఎన్నేళ్ళకో కనబడడం...." సంతోషం పొంగి వచ్చింది మనోరమకు స్నేహితురాలిని చూడగానే.

"నువ్వా వనజా కులాసానా.....ఎక్కడా వుండటం."

"మేము హైదరాబాద్‌లో వుంటున్నాం... ఎలా వున్నారూ, ఈ అబ్బాయి మీ తమ్ముడు కదూ, అబ్బ గుర్తుపట్టలేకుండా పెరిగిపోయావే. నేను గుర్తున్నానా? అప్పుడు బాగా చిన్న వాడివి...."

గబగబా మాట్లాడుతోంది వనజ. పరీక్షగా చూస్తోంది మనోరమని.

"మేం, 'రాంపూర్'లో వుంటున్నాం, అక్కడ జాబ్ చేస్తున్నారు బావ..."

"ఎంత జీతం, కారూ, గీరూ, అంతా వున్నదా?..."

మనోరమ తెల్లబోయింది. తమ్ముడివేపు చూచింది. ఇన్నేళ్ళ తరువాత కనబడ్డ స్నేహితురాలు, అడిగే ప్రశ్నేనా ఇది. 'బావున్నావా? పిల్లలా? ఏమిటలా వున్నావూ, కులాసాగా లేదా...' అని కనీసం తన అవతారం చూచి అయినా అనవచ్చు. కానీ ఇదేం ప్రశ్న.

రవి, మనోరమ వేపు చూచి నవ్వాడు.

"ఏమిటి జీతం దాకా వెళ్ళిపోయారు అప్పుడే, జీతం ఎంత, నాలుగంకెల్లో వున్నారు, వాళ్ళ పెట్రోలు ఖర్చుకు చాలదు అది. వాళ్ళకు మీ హైదరాబాద్‌లో ద్రాక్ష తోటలు వున్నాయి, లాండు వుంది. అబిడ్స్‌లో పెద్ద షాపు వుంది. మా బావ వుద్యోగం వట్టి గొప్ప కోసం, దానివల్ల వాళ్లకి కొంచెం ఆదా కూడా లేదు, ఏదో సోషల్ స్టేటస్ కోసం..."

రవి చెప్పుకుపోతున్నాడు. మనోరమ తెల్లబోయి చూస్తోంది అతనివేపు. వనజ సందేహంగా చూస్తోంది మనోరమ వేపు. ఆర్గండీ చీరె, జాకెట్టు, మెడలో ఒంటిపేట గొలుసు, నల్లపూసలు, చేతులకి రెండే బంగారు గాజులతో సింపుల్‌గా వుంది.

"మరి నడిచిపోతున్నారే...."

"ఈమెకి ఈ మధ్య వంట్లో కులాసా లేదు లెండి, డాక్టర్ నడవక అలా నీరసం పట్టుకుందన్నారు. రోజూ కొంచెం దూరం నడుస్తుంటే తేలిగ్గా వుంటుందని హాస్పిటల్ ఇక్కడేనని నడిచిపోతున్నాం..."

"ఏం బిజినెస్సూ..."

వనజకు మనోరమను చూస్తే దిగులువేసింది. వాళ్ళకున్న ఆస్తిలో మనకు సగం కూడా లేదు కదా అని.

"సినిమా డిస్ట్రిబ్యూషన్‌లో పెట్టుబడి పెడతారు" తాపీగా అన్నాడు రవి.

"సినిమాల్లోనా...."

"ఆ, ఆ" అంది మనోరమ అప్పటికి తేరుకుని, తను మాట్లాడడం లేదని జ్ఞాపకం వచ్చింది.

"చాలా సంతోషమే. మరి వస్తాను. ఎప్పుడయినా, మీ ఇంటికి రావాలి. మీ అమ్మగారుండేది ఇదివరకు ఉన్న ఇంట్లోనేనా..."

"ఆ... అవును..."

"సరే వస్తాలే. మరి..."

వెళ్ళిపోయింది వనజ. అక్కతమ్ముళ్ళిద్దరూ నవ్వుకొన్నారు.

"మరీ అంత అబద్ధాలు ఎలా చెప్పావురా?"

"నోటితో. మరి లేకపోతే ఆ ప్రశ్నలేమిటి? ఎంత జీతం, ఎంతాస్థి వుంది. మా మగవాళ్ళం, ఇంత ఘోరంగా మాట్లాడుకోం. మా సోషల్ లైఫ్ ఇలా వుండదు. ఇలా డబ్బుందీ అని ఎవడూ కేన్వాస్ చేసుకోరు. సరదాకి ఒక జోక్ చెప్పనా.. మొన్ననోసారి మా ఫ్రెండ్స్ అంతా సెంటర్లో వున్నాం. మావాడొకడు ఒక పందెం వేశాడు.ఆ బజార్లో వచ్చే ఎవరన్నా అమ్మాయిని పలకరించి మాట్లాడితే వంద రూపాయలు పందెం అని. సరే, పో అన్నా... ఇది జస్ట్ జోక్ క్రింద తీసుకో. అంతలో వీధి మొదట్లో ఎవరో అమ్మాయి వస్తోంది. ఈ అమ్మాయితో మాట్లాడి చూడు గురూ! అన్నాడు ఒకడు.

సరేనని నేను ముందుకు నడుస్తూ వెళ్ళి, ఆ అమ్మాయితో... 'ఎక్స్‌క్యూజ్‌మి మేడమ్, ఆదిత్యనగర్ కాలనీ ఎటండీ అన్నాను మర్యాదగా' ఆ బజారు తిరిగితే, ఆదిత్య కాలనీ అని మనకు తెలుసుగదా, పాపం, ఆ పిల్లకేం తెలుసు. మరండీ, ఈ బజారు చివరకు పోయి ఎడంవేపు తిరగండి. అదంతా ఆదిత్యా కాలనీయే అన్నది. నేను థాంక్యూ మేడమ్ అనేసి ముందుకుపోయాను. ఆ అమ్మాయి వెళ్ళిపోయింది. తీరా వచ్చి వంద ఇయ్యరా అంటే, ఏం మాట్లాడావు చెప్పు గురూ, అని అంటాడే. ఎవరనీ, మన రెడ్డిలేడూ పొడుగ్గా వుంటాడు. లూనామీద వస్తాడు వాడు. అదీ మా సోషల్ స్టేటస్. అంతేగానీ....

మనోరమ విరగబడి నవ్వింది.

"అదేం జోక్‌రా.... అమ్మాయిలతో మాట్లాడితేనే గొప్పా..."

* * *

రవి స్వీట్స్, ఫ్రూట్స్ తీసుకొని వారం తరువాత వెళ్ళేడు హాస్టల్‌కు.

"వార్డెన్ పర్మిషన్ తీసుకున్నాను లలితా బయటికి పోదామా?"

"ఎక్కడికి వెళదాం?"

"బజారుకు వెళ్లి కాఫీ తాగేసి, ఆంజనేయస్వామి గుడి వుంది, అక్కడికి పోదాం. ఊరికి చివరగా వుంటుంది కదూ, జనం వుండరు."

"మీరు ఆంజనేయ భక్తులా?"

"భక్తి కాదు... మొన్నామధ్య ఒక ఫ్రెండ్ పెళ్ళికి అక్కడికి వెళ్ళాను. పక్కనే సత్రం వుంది. వాతావరణం బాగుంది. ఊరికి దూరంగా వుంది కదూ, ఎవరూ వుండరు. వెనకవైపు కొండలు అవీ వుంటాయి. అక్కడ కూర్చోవచ్చు...."

"ఆс.... కూర్చుని...."

"కబుర్లు చెప్పుకుందాం."

"చెప్పుకుని....."

అప్పుడు తిరిగి చూచేడు లలితను. నవ్వుతోంది.

"ఈ వారం రోజుల నుంచీ ఎంత బోర్‌గా వుందో. ఎవ్వరూ రాలేదు. నీకోసం చూచేను."

"నిజంగా చూచేవా?"

"చూడనని ఎందుకు అనుకున్నావు...."సూటిగా వచ్చింది ప్రశ్న.

"లలితా...."

❊ ❊ ❊

"ఈ గుడి పక్కనుంచి వెళితే కొండమీదకు వెళ్ళవచ్చు. అటు కాదు. ఇటు మెట్లదారి లేదు."

"గుళ్ళోకి పోదాం రవీ..."

"గుళ్ళోకా... నేనెప్పుడూ వెళ్ళను లలితా."

"ప్లీజ్"

కాదనలేకపోయాడు రవి.

"సరే పద...."

లలిత అక్కడ పంపు దగ్గర కాళ్ళు కడుక్కుని వచ్చింది.

"అష్టోత్తరమా?"

"అవును" అంది లలిత.

"గోత్ర నామాలు చెప్పండి."

అప్పటిదాకా చేతులు వెనుక పెట్టుకుని ఊరికే గమనిస్తూ నించున్న రవి ఉలిక్కిపడ్డాడు. 'కాదు' అంటూ ఏదో చెప్పబోయిన రవి చేయి పట్టుకుంది లలిత. రవికి ఉక్కిరిబిక్కిరి అయినట్టుగా వుంది.

"....గోత్రస్య, ధర్మపత్నీ సమేతస్య, క్షేమ, స్థైర్య, ఆయురారోగ్య..." పూజారిగారు సంకల్పం చదువుతున్నారు.

తన చేతిలో వున్న ఆ కోమలమైన చేతినే చూచాడు రవి ఒక క్షణం పాటు. బయటికి వచ్చేరు ఇద్దరూ.

"ఇక్కడ ప్రశాంతంగా కూర్చుని కబుర్లు చెప్పుకోవచ్చునని తీసుకువస్తే అనవసరంగా పది రూపాయలు దండగ చేశావు."

లలిత చురుక్కున చూచింది అతనివేపు.

"అలా అనకు రవీ ఇక్కడ...."

"ఏం ఎవరున్నారు?"

"ఉన్నారని కాదు, ఎటూ వచ్చేం కదా, అల్లాంటి మాటలు ఎందుకు?"

"ఏమన్నాను నేను, ఏదో తప్పుచేసినట్లు, కాస్తంత ప్రాక్టికల్‌గా ఆలోచించు" రవి కొబ్బరి తినడంలో మునిగిపోయాడు.

లలిత ఒకసారి లేచి నిలబడి గుడివేపు తిరిగి నమస్కారం చేసింది.

రవి నవ్వేడు. కొబ్బరి చిప్ప కింద వుంచేసి, లేచి నిలబడి, తనూ లలితకు నమస్కారం చేశాడు కళ్ళు మూసుకుని.

"అరే, అదేమిటి? నా కెందుకు?"

"మరే... రేపొకవేళ నేనేదైనా కోరిక కోరేననుకో. అది తీర్చేది నువ్వు. ఇప్పుడు కానీ, భవిష్యత్తులో గాని నీగ్గాక ఈ దేవుడికెందుకు?"

లలిత మొహం ఎర్రబడింది. "మరీ హద్దులు దాటుతున్నావు" అన్నది.

"ఏమిటీ, నేను హద్దులు దాటేనా? లలితా ఇటు చూడు. నువ్వు నాతో రమ్మనగానే ఎలా రాగలిగేవు? ఒక రిక్షాలో ఎలా ఎక్కేవు? గుడికి వచ్చి ఎలా అర్చన చేయించుకున్నావు? ఇప్పుడు చెప్పు నేను హద్దులు దాటేనా?" కోపం వచ్చింది రవికి.

లలిత కళ్ళలో నీళ్ళు తిరిగేయి.

రవికి ఆవేశం దిగిపోయింది.

"అదిగో అప్పుడే ఆడపిల్లనని అనిపించుకోవద్దు. అలా ఏడ్చేవాళ్ళంటే నాకు కొంచెం కూడా గౌరవం లేదు. చేతనైతే నువ్వూ తిరిగి ఏదైనా అను. అంతేగానీ ఏడవడం ఎందుకు?"

"నువ్వు విసుక్కున్నావు. కోపగించుకున్నావు."

"నువ్వూ విసుక్కో కోపం తెచ్చుకో, అంతేగాని ఏడుస్తారా? ఇదిగో లలితా, ఇలాంటి సీన్లు నాకు ఇష్టం లేదు. నువ్వు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో. నీకు ఇష్టం లేకపోతే, ఈ పరిచయం ఇంతటితో ఆపేద్దాం. అంతే, నీతో చెప్పేది రెండే మాటలు. నువ్వంటే నాకు ఇష్టం. నిన్ను పెళ్ళిచేసుకుంటాను. నువ్వు ఇష్టపడితే... అంతే. ఆలోచించుకో."

లలిత తలవంచుకుని కూర్చుంది. చేతుల్లో చెమటలు పోసి, చల్లగా అయిపోయాయి. కాళ్ళు వణికిపోతున్నట్టు వుంది. ముందుగా బండ మీద కూర్చుంది.

'ఎంత సూటిగా చెప్పేడు.... ఒక కులం కాదు, డబ్బు ఏమంత లేదు.

అమ్మ ఒప్పుకోదు' గజగజలాడింది లలిత. 'మరెందుకు వచ్చేవు? నీ మనసులో అతన్ని గురించిన ఆలోచన లేదా? లేనప్పుడు, ఈ పరిచయం ఎందుకు పెంచుకోవడం?' లలిత మనసే నిలదీస్తోంది. ఆలోచన ఎందుకు లేదు? రవి ఎంత అందంగా వుంటాడు! ఎంత మంచివాడు! నెలరోజుల నుంచీ గమనిస్తోంది. ఒకసారి మనసులో అతనంటే ఇష్టం కలిగేక ఇక వదులుకునే ప్రసక్తి లేదు. అంతే. ఐ లవ్ హిమ్.

మనసు ఆనందంతో తేలిపోయింది లలితకు.

కళ్ళెత్తి చూచింది. ఆమెనే పరీక్షగా చూస్తున్నాడు రవి.

"చూడు, నువ్వు ఇబ్బంది పడవద్దు. నిన్ను బాధ పెట్టే ఉద్దేశం నాకు లేదు. నీకు ఇష్టం లేకపోతే చెప్పు. ఇంతవరకు ఈ స్నేహం ఆపేద్దాం. మగ పిల్లలతో స్నేహం చేసేంత దూరం రాలేదు మన నాగరికత. అందుకే అనవసరంగా పరిచయం పెంచుకోవద్దు..."

"నాకు ఇష్టం లేదంటే నీకు బాధ లేదా?" లలిత ప్రశ్నకు రవి నవ్వేడు.

"అలా పరీక్షలు పెట్టకు. నేను ప్రాక్టికల్‌గా ఆలోచిస్తాను. అందుకే అడిగేను 'నీకు బాధలేదా? గడ్డం పెంచుకుంటావా?' ఇలాంటి ప్రశ్నలు అడక్కు. ఒక్క ముక్కలో చెప్పు. ఎస్ ఆర్ నో. నీకు నా విషయాలన్నీ తెలుసు. నేనేమిటో ఈ నెల రోజుల నుంచీ చూచేవు. నాతో హాయిగా బ్రతకగలను అనుకుంటే చెప్పు...."

"ఆడపిల్లలు ఇంకెలా చెప్తారేం ఇలాంటి మాటలు?" నవ్వింది లలిత.

రవికి సంతోషం పొంగి వచ్చింది.

"ఇంకెలా చెప్తారు... ఇలాగే...నీలాగే."

* * *

"రాజీ ఇందాక లలిత కనబడింది" రామకృష్ణ ఇంటికి రాగానే చెప్పేడు.

"ఏదీ రాలేదే. పర్మిషన్ లేకుండా రాదుగా."

"పర్మిషన్ తీసుకునే వచ్చి వుంటుంది. రవీ, లలితా రిక్షాలో పోతూ కనబడ్డారు. విజిటర్స్‌లో రవి పేరు వ్రాశాం కదా."

"అయినా ఎక్కడకు పోయిందో ఇక్కడికి రాలేదు."

"నాకు కనబడ్డారు, రవీ, లలితా రిక్షాలో పోతూ..."

"రవీ, లలితానా? అదేమిటండీ?"

"అదే నాకూ అర్థం కాలేదు, చిన్నపిల్లలా తెలుసుకోకపోవడానికి?"

"రవి ఇలా చేస్తాడని నేను అనుకోలేదు."

"రవి చేసేదేమిటి? లలిత చిన్నపిల్లా ఏమన్నానా తెలుసుకోకపోవడానికి?"

"మీరు మందలించకూడదూ?"

"ఏమని? మీరిద్దరూ ఒక రిక్షాలో రాకండిరా అనా? ఇదిగో ఇటు చూడు, రవితో నా స్నేహం ఇవాల్టిది కాదు. వాడు నా తోడబుట్టినవాడు కాకపోయినా అంతకంటే ఎక్కువ. వాడిని నేనేదో అనేమాట కల్ల. ఇకపోతే లలిత ఆడపిల్ల. ఆ అమ్మాయిని ఏమీ అనే అధికారం నాకు లేదు."

"అయ్యో, అదేం మాటండీ? అధికారం నాకు లేదంటారూ, రేపేదైనా అయితే మనల్ని అనరూ దగ్గర వుండి కనిపెట్టి వుండలేదని? పైగా ఆ పిల్లవాడు బ్రాహ్మడు కాదు, అమ్మో, మా పిన్ని చంపిపెడుతుంది నన్ను."

"నువ్వు ముందు నన్ను కంగారు పెట్టకు. నాకు అసలే బుర్ర చెడిపోయి వుంది. రేపు సన్‌డేనాడు పోయి లలితను తీసుకువద్దాం. తనంతట తను చెపితే సరే, లేకపోతే తరువాత ఆలోచిద్దాం."

"ఇదేం గోల.." రాజేశ్వరి గొణుక్కుంది.

రాజేశ్వరి ఏం గొణిగినా, రామకృష్ణకు మటుకు సంతోషం కలిగింది. ఇద్దరూ చిన్నవాళ్ళు, చక్కగా వున్నారు. ఏమీ గొడవలు రాకుండా ఒకటయితే బాగుండు ననుకున్నాడు.

* * *

"నీకింత ధైర్యంఎలా వచ్చిందే? సుభద్రమ్మ పిన్ని ఒప్పుకుంటుందనే? మన కులమా, పాడా? మంచి కట్నం ఇచ్చి ఏ డాక్టర్నో, ఇంజనీరునో తేవాలని మీ అమ్మ కూర్చుంటే నువ్విలా చేస్తావా? మనం వచ్చేప్పుడు ఏమందీ? 'చదువుకుంటున్న పిల్ల కావాలంటున్నారే ఉద్యోగస్తులైన మగపిల్లలు. అందుకనే నిన్ను చదివించడం' అనలేదే?"

అక్కయ్య పెట్టిన పకోడీలు తింటూ ఉపన్యాసం అంతా తీరుబడిగా విన్నది లలిత.

"రవి మంచివాడు కాదా చెప్పు. నువ్వే చెప్పేవుగా అతనిలాంటి మనిషి నూటికి ఒకడు కూడా వుండడని."

"నోరు మూసుకో, నేను మనిషి వస్తుతః ఎటువంటివాడో చెప్పేను. అంతేగాని పోయి అతన్ని పెళ్ళి చేసుకోమని చెప్పేనా?"

"నువ్వు చెప్పలేదనుకో. నాకే అనిపించింది. అంత మంచివాణ్ణి నేనే ఎందుకు చేసుకోకూడదు? అని. రవికి నేనంటే ఇష్టం. నాకు అతనిలో ఏ లోపమూ కనబడలేదు."

"నేను నీతో వాదించలేను. ఇదిగో నామీద నెపం వుంచవద్దు. ఇవాళే పిన్నికి ఉత్తరం రాస్తున్నా. నీ ఇష్టం తరువాత..."

"అబ్బ.... ఎన్నాళ్ళకి ముద్దు వచ్చే పని చేస్తానన్నావే రాజక్కా. నువ్వు ఆ పనిచేస్తివా చచ్చి నీ కడుపున పుడతా. అమ్మ ముందు ఈ విషయం ఎలా తేవడమా? అని నాకు ఒకటే బెంగగా వుంది."

"అమ్మో, ఎంత ధైర్యస్తురాలివయిపోయావే, నువ్వింకా చిన్నదాని వనుకుంటున్నా.... అప్పుడే ప్రేమలు...."

"స్వీట్ సిక్స్‌టీన్‌లో ప్రేమించక, సిక్స్‌టీ ఇయర్స్ వచ్చాక ప్రేమిస్తారేమిటి?" లలిత కిలకిల నవ్వింది.

రూమ్‌లో పడుకుని అక్కా చెల్లెళ్ళ సంభాషణ విన్నాక, రామకృష్ణకు నవ్వు ఆగలేదు. ఇప్పుడు తను పొరపాటున నవ్వితే రాజేశ్వరి తనమీద పడిపోతుంది. నువ్వు సపోర్టు వాళ్ళకి అంటూ, ఊరుకున్నంత ఉత్తమం లేదన్నారు పెద్దలు.

* * *

"నీ వుత్తరం చదివాక కాళ్ళూ చేతులూ అడలేదే రాజీ, తిరుగుజాబు రాసేపాటి ఆలస్యం కూడా చేయబుద్ధి కాలేదు. ఎంత పని చేసిందీ, చిన్నముండ అనుకుంటుంటా, అమ్మో నా పరువు తీసిందే ఇది. దీన్ని ఇంకా ఎంతో చదివించి, అందలాలు ఎక్కిద్దాం అనుకున్నా, బుద్ధి బురద వేపు లాగుతుంటే. మీ బాబాయి లేకపోవటమే నా ఖర్మ. ఒక్కదాన్ని మగదిక్కు లేకపోయినా, ఆ పొలాలు, కొంపా సమర్థించుకుంటూ, ఈ పిల్ల వెధవల కోసమని ఆ పల్లెలో పడివుండి నేనింతగా ఆశపెట్టుకుంటే అమ్మో ఎంత పని చేసిందీ, ఇంతకీ ఎవరా కుర్రాడు? ఇద్దరు మగబిడ్డలు దీనికంటె పెద్దవాళ్ళయి వుంటె ఇవాళ దాన్ని బ్రతకనిచ్చేవాళ్ళా, పసివెధవలయిపోయిరి...."

సుభద్రమ్మ ఏడవడం మొదలు పెట్టింది. రాజేశ్వరికీ కళ్ళనీళ్ళు వచ్చాయి. బాబాయి పోయాక ఈ పిల్లల కోసం పిన్ని ఎంత తాపత్రయపడిందో తను ఎరగందికాదు. రామకృష్ణ వెళ్ళాడు లలిత కోసం. రాగానే ఏమవుతుందో అని భయంగా వుందామెకు.

"అమ్మా....."

తల్లిని చూచిన ఆనందంతో పరుగెత్తి వచ్చింది లలిత. సుభద్రమ్మ కళ్ళు ఎర్రబడ్డాయి. ఒక్కసారి లేచి నుంచుని లలిత జడపట్టుకుని ముందుకు గుంజి గబగబా దెబ్బలు వేసింది.

"పిన్నీ... ఊరుకో పిన్నీ...." రాజేశ్వరి పరుగులు తీసింది.

రామకృష్ణ ఆమె రాగానే కొడుతుందని ఊహించలేదు. ఏదో చెప్పుకుం

టుందని అనుకొన్నాడు. నిర్ఘాంతపోయి చూస్తున్నాడు. రాజేశ్వరి బలవంతంగా విడిపించబోయినా దూరంగా తోసింది సుభద్రమ్మ.

జడ గట్టిగా పట్టుకోవడంతో విడిపించుకోలేకపోయింది లలిత. ముఖంమ్మీద వరసగా దెబ్బలు పడడంతో, బుగ్గలు ఎర్రబడిపోయాయి. బంగారు గాజులు బలంగా తగిలి కణతమీద రక్తం వచ్చింది. చేతులు, వీపు వాతలు తేలిపోయాయి. రామకృష్ణ స్పృహ వచ్చినట్టుగా కదిలి లలితను దగ్గరగా లాక్కున్నాడు.

" మీరు వదలండి ముందు" అంటూ.

రామకృష్ణను నెట్టిపారేయను కుదరక సుభద్రమ్మ ఆగిపోయింది. లలిత వెక్కి వెక్కి ఏడుస్తోంది ఎప్పుడూ దెబ్బలుతిని వుండకపోవడంతో. పైగా రామకృష్ణ, రాజేశ్వరి ముందు దెబ్బలు తినడం సిగ్గుగా వుంది.

"ఇంకా ఏడుపు ఎందుకు? సిగ్గులేదూ ఏడ్చేందుకు, ఇంటికి పోదాం పద. ఇక చదువూ వద్దు, చట్టుబండలూ వద్దు. పోయి పుస్తకాలు అన్నీ సర్దుకో. తయారవు పో..." ఆవేశంతో అందావిడ.

"మీరు వుండండి. తొందరపడకండి, ఎందుకు చదువు మానుకొని పోవడం, ఫీజులు కట్టడం అయిపోయింది. హాస్టల్‌లో డిపాజిట్ కట్టాం. చదువు మానేది ఎందుకు?"

"నీకు తెలియదు నాయనా...పోనీ పాడు ఫీజులు. పిల్లను ఇంటికి తీసుకుపోతాను. ఇంక చదువు వద్దు. ఇక్కడ వుంచేందుకు నాకు ధైర్యం లేదు...."

రామకృష్ణ మాట్లాడలేదు. "ఆమె అసలే కోపంలో వుంది. ఇప్పుడు చెప్పినా ప్రయోజనం లేదు" అనుకున్నాడు.

"సరే కానీయండి చూద్దాం. లలితా ముందు లోపలికిపోయి ముఖం కడుక్కో పో.... రాజీ కాఫీ వుందా? వంట చేయి త్వరగా, లలిత టిఫిన్ కూడా తినలేదు. లలితా పోయి కాఫీ తాగు పో..." అన్నాడు రామకృష్ణ.

లలిత తల అడ్డంగా వూపింది వద్దని.

"సరే పోయి వీధి గదిలో పడుకో పో..." అన్నాడు అనునయంగా. అతనికి జాలిగా వుంది లలితను చూస్తోంటే.

వంట చేస్తున్న రాజేశ్వరి దగ్గర కూర్చుంది సుభద్రమ్మ.

"అమ్మాయ్ రాజీ, ఆ అబ్బాయి ఎవరే? వాళ్ళు తెలుసా?"

"తెలుసు పిన్నీ, పిల్లవాడు బాగానే వుంటాడు..." అన్నది రాజేశ్వరి. ఏం మాట్లాడాలన్నా భయంగా వుంది రాజేశ్వరికి. ఏమంటుందోనని.

"నువ్వు దానితో అనకు గానీ, మనం వాళ్ళింటికి ఒకసారి పోదామా?"

రహస్యంగా గొంతు తగ్గించి అన్నదామె. ఇది ఎంతవరకు పోతుందోనని ఆదుర్దాగా వుంది సుభద్రమ్మకు.

"మనమా? ఎందుకు?" రాజేశ్వరికి కాళ్ళు వణికాయి. అక్కడ ఈమె ఏం గొడవ పెట్టుకుంటుందోనని.

"వూరికే పోయి చూద్దాం. అసలు వాళ్ళ ఇంటి తీరు ఎలా వుందో చూద్దాం ముందు. నీకు పరిచయం వుందన్నావు కదా! దానితో మటుకు ఏవో కొంటానికి వెళుతున్నామని చెప్పు. పైగా బజార్లో పిల్లలకు చొక్కా గుడ్డలు తీసుకోవాలి. అవీ తీసుకున్నట్టు వుంటుంది కదా?"

మగదిక్కు లేకుండా ఆస్తులను చూసుకోవాల్సి రావడంతో సహజంగానే నిబ్బరం ఏర్పడింది సుభద్రమ్మకు. పైగా లలితను ఆవేశం కొద్దీ కొట్టింది కానీ, 'ఇలా అందరి ముందు కొట్టేనే' అని మనసులో బెంగగా వుందామెకు. ముందు లలితను ఇక్కడి నుంచి తీసుకుపోతే అంతా సర్దుకుంటుంది, 'దానికేం తెలుసు చిన్నపిల్ల. వాడెవరో మాయచేసి వుంటాడు'. అనుకొంటోంది ఆమె.

※ ※ ※

తెల్లవారేక గబగబా పనులు ముగించుకుని, రామకృష్ణ షాప్‌కి, రాజేశ్వరి, సుభద్రమ్మ షాపింగ్‌కీ వెళ్ళిపోయారు. అంతా వెళ్ళాక, లేచి అద్దంలో ముఖం చూచుకుంది లలిత. అంతా కందిపోయి వుంది. నుదుటి మీద రక్తం గడ్డకట్టింది. దెబ్బలు చూచుకొని దుఃఖం ముంచుకొచ్చింది.

"హల్లో ఏంజిల్.... ఎప్పుడు రాక...."

హుషారుగా వినబడింది రవి గొంతు వెనుక నుంచి.

మొహం చూపించలేక లోపలికి పరుగుతీయబోయింది లలిత.

రవి చేయిచాపి ఆమెను పట్టుకున్నాడు. సందేహంగా లోపలికి తొంగిచూచాడు. "ఎవరూ లేరా?" అంటూ లలిత మొహం చూచి వులిక్కిపడ్డాడు రవి.

"ఏమయింది లలితా? ఈ మొహం ఏమిటి? ఏమయింది?"

సమాధానంగా లలిత బావురుమని ఏడ్చింది.

కంగారుపడిపోయాడు రవి. అతనికి ఎలాగో వుంది. ఆ పిల్లను అలా చూడడం. లలిత వెక్కిళ్ళు పెట్టింది. ఓదార్చిన కొద్దీ దుఃఖం పెరుగుతుంది కదా!

"అమ్మ వచ్చింది. గొడవ అంతా తెలిసిపోయింది."

"అయితే ఇలాగా కొట్టడం. వళ్ళంతా వాతలు తేలిపోయాయి."

చేయిపట్టి దగ్గరకు లాక్కున్నాడు లలితను రవి.

"అరే.... ఇటు చూడు... ఏడవకు, నా వైపు చూడాలి... ఇటు చూడు"

అతని మొహం చూడలేనట్లుగా, అతని భుజానికి మొహం ఆనించి నిలుచుండిపోయింది లలిత.

"మైగాడ్....ఎలా కొట్టారావిడ.... ఇంత దారుణంగానా..."

బాధగా వుంది అతనికి. దీనిలో తనకూ భాగం వుంది. లలితను వదిలేసి "పోయి మొహం కడుక్కుని తల దువ్వుకో. బయటికి పోయి ఏదన్నా తిందువుగాని.... ఏదన్నా తిన్నావా? అసలు అన్నం తిన్నావా?"

తినలేదని తల అడ్డంగా వూపింది.

"ఎందుకు తినలేదు. ఇలా ఏడుస్తూ పడివున్నావా! పద హోటల్‌కు పోదాం ఏదన్నా తిందువుగాని...."

"అమ్మో ఇప్పుడా! అమ్మ, అక్కా వస్తారు ఇప్పుడు. చాలా సేపయింది షాపింగ్‌కు వెళ్ళి. నేను మా వూరు వెళ్ళిపోతున్నాను రవీ...."

"ఎందుకు ఇప్పుడు... కాలేజీకి వెళ్ళవూ?"

"మానేయమంది అమ్మ. రేపు ఊరికి వెళ్ళిపోతాం రవీ... ఊరెళ్ళిపోతే ఎలా కనబడతావు రవీ..."

రవికి సమాధానం తోచలేదు.

"ఏదో చేద్దాం.... నువు ముందు పోయి అన్నం తిను. పో. తర్వాత మాట్లాడుకుందాం..."

"ఇప్పుడు ఇంకేం మాట్లాడకు రవీ... అమ్మ వాళ్ళు వస్తారు. నువు కనబడితే ఇప్పుడు..." ఆగిపోయింది లలిత.

రవి లేచి నుంచున్నాడు. "సరే నేను వెళ్ళిపోతాను గానీ... నువు కాలేజీ మాననని చెప్పకపోయావూ?"

"ఎందుకు చెప్పను, అమ్మ వినదద్దూ...."

"సరే నువ్వు వెళ్ళిపో. నేను లెటర్ వ్రాస్తాను. నీ లెటర్స్ ఎవరూ చదవరు కదా..."

"ఎవరున్నారు చదివేందుకు. అమ్మకు ఇంగ్లీష్ రాదు కదా."

"సరే నే వెళతాను... నువు కంగారుపడకు. అంతా సక్రమంగా జరుగుతుంది. వెళ్ళేదా!"

లలిత సూటిగా రవి వేపు చూసింది.

"రవీ, నే వెళ్ళాక నన్ను మరచిపోవు కదూ..."

రవి నవ్వాడు.

"నిన్నా.... మరిచిపోవడం విషయం కదూ? ఏమోనబ్బా... చెప్పలేను..."

"ఏయ్"

"మరీ, లేకపోతే ఇంకా ఈ ప్రశ్న అడిగే స్థితిలో వున్నావా నువు. ఇటు చూడు.."

రవి లలిత దగ్గరకు వచ్చి బుగ్గమీద ముద్దు పెట్టుకున్నాడు.

సిగ్గుతో వణికింది లలిత.

"సంతోషంగా హాయిగా వుండు. అన్ని విషయాలతో నేను లెటర్ వ్రాస్తాను. వాళ్ళు ఇష్టపడకపోతే నిన్ను రాక్షస వివాహం అయినా చేసుకుంటా. సరేనా..."

లలిత నవ్వింది.

"ఒకవేళ రహస్యంగానే చేసుకోవలసివచ్చిందనుకో, నువు ధైర్యంచేసి రాగలవా?"

"ఇంకా, ఈ ప్రశ్న అడిగే స్థితిలోనే వున్నావా నువ్వు...?" రవిలాగే వెనక చేతులు వుంచుకొని రవి అన్నట్లే అన్నది లలిత.

నవ్వేశాడు రవి.

"ఓ.కె. నేను వెళుతున్నా, ధైర్యంగా వుండు."

అపురూపమైన వస్తువును చూచినట్లు చూచాడు ఒకసారి లలితను రవి వెళ్ళబోతూ.

లలిత బుగ్గమీద చేయి వేసుకుంది. ఇంకా రవి పెదవుల స్పర్శ అక్కడే వున్నట్లుగా వుంది. చకచకా వెళ్ళిపోతున్న రవినే చూస్తూ నిలబడింది.

"ప్రేమ కంటె ఎక్కువేముందిరా..."

బసవరాజు అప్పారావు గేయం గుర్తుకొచ్చింది లలితకు. వైతాళికులు చేతులో లేకుండా ఎప్పుడూ కనబడడు రవి. అతనికి ఆ పుస్తకం ప్రాణం. అతని స్నేహంతో లలితకు ఆ గేయాలన్నీ కంఠతా వచ్చేశాయి.

ప్రేమించు సుఖముకై
ప్రేమించు ముక్తికై
ప్రేమించు ప్రేమకై
ప్రేమించవలెనురా...

అనుకొంది గర్వంగా.

* * *

లోపలికి వస్తున్న రాజేశ్వరిని చూడగానే ప్రాణం లేచి వచ్చింది మనోరమకు. అస్తమానం పడుకుని వుండాలంటే విసుగు. లేచి తిరిగి ఏదో ఒక పనిచేద్దామంటే యశోదమ్మ ఒప్పుకోలేదు.

'ఇంత నష్టపోయావు, హాయిగా పడుకోక నీకు ఇంకా పనికూడా ఎందుకు?' అని చేయనివ్వడం లేదు.

"రాజీ.... నిన్ను చూడగానే ప్రాణం లేచి వచ్చిందనుకో, తోచక చచ్చి పోతున్నాను. నేనే వద్దామంటే, 'నీరసంగా వున్నావు' అంటూ కదలనీయలేదు..." అంది గబగబా లేచివస్తూ.

రాజేశ్వరికి మనసులో భయం చేత సంతోషంగా లేదు. తన వెనకాలే వున్న సుభద్రమ్మ పిన్ని, ఏం గొడవ పెట్టుకుంటుందోనని దడగా వుందామెకు.

"అమ్మా, రాజీ వచ్చింది....." లోపలికి ఒక కేక వేసింది.

"కూర్చోమనవే... మొన్నీమధ్య కబురు పెడితివి వస్తానని రాలేదు. వంట చేస్తిని, చూచి చూచి విసుగు పుట్టిందనుకో..."

సుభద్రమ్మ వంట గదిలోంచే పరామర్శ చేసింది.

రాజేశ్వరికి ఇక వూరికే నోరుమూసుకుని నిలుచుండడం బావుండలేదు. వెనకే నిలుచున్న సుభద్రమ్మ ఇల్లు శల్యపరీక్ష చేస్తోంది. ఆమెకు ఇల్లు ఏమంతగా నచ్చలేదు. పల్లెలో, తమ ఇంటితో పోల్చుకుంటే ఈ ఇల్లు మొత్తం తమ గొడ్లచావిడి అంత లేదు అనుకుంది. గోడలకు ఆనించి వుంచిన రెండు బీరువాల పుస్తకాలు తప్పితే, ఇంట్లో సామానేమీ ఆమెకు కనిపించలేదు. ఇల్లంతా సాదాగా వుంది.

"కూర్చో పిన్నీ.... ఈమె మా సుభద్రమ్మ పిన్ని. నిన్ననే ఊరునుంచి వచ్చింది. వాళ్ళమ్మాయి ఇక్కడ కాలేజీలో చదువుకుంటోంది. పిన్ని మా పల్లెలోనే వుంటుంది... నీవు కూర్చో పిన్ని, నేను అత్తయ్యను పలకరించి వస్తాను..."

లోపలికిపోయింది రాజేశ్వరి.

"మీ అత్తగారిది ఏ వూరమ్మాయ్...."

మాటలు కలిపింది మనోరమతో సుభద్రమ్మ.

"ఇక్కడేనండి, నాగాయలంక అని కృష్ణా జిల్లాలో వుంది. వారు మటుకు కాశ్మీర్ దగ్గర ఉదంపూర్‌లో జాబ్ చేస్తున్నారు. మేం అక్కడే వుంటాం. ఆయన మా మేనత్తగారి అబ్బాయ్..."

"కాశ్మీర్ దగ్గరంటే చాలా దూరంగా.... రావాలంటె చాలా డబ్బు అవదూ?"

"ఎందుకవదూ, తను పనిచేసే కంపెనీయే ట్రావెలింగ్ ఎలవెన్స్ కొంత

ఇస్తుంది. మరికొంత మనసం పెట్టుకోవాలి. అయినా ఎక్కువగా రాను.... ఈ మధ్య ఎబార్షన్ అయింది. బావ ఇక్కడ ఒక నెల రోజులు రెస్టు తీసుకోమని వదిలి వెళ్ళారు."

యశోదమ్మ, రాజేశ్వరి వచ్చేరు.

యశోదమ్మ పలకరింపుగా నవ్వింది. సుభద్రమ్మకు నవ్వబుద్ధి కాలేదు.

ఆవిడకు మనసులో దుఃఖంగా వుంది. ఈ ఇల్లు, వస్తువులు, సామాన్యమైన సంసారం చూచి ఆమెకు దిగులుగా వుంది.

"నేను హాయిగా, బోలెదు కట్నం ఇచ్చి పెద్ద సంబంధం చేద్దామని కూర్చుంటే ఈ పిల్లది ఎంత పనిచేసింది. ఏముందీ ఇక్కడ దరిద్రం తప్పితే. ఏ ఉద్యోగస్తుడికో, డబ్బున్నవాడికో ఇచ్చి కట్టపెడితే హాయిగా బ్రతుకుతుందనుకుంటే...."

ఆవిడ వుక్రోషం పట్టలేకపోతోంది.

"హలో... వదినా ఎప్పుడూ రాక..."

వరండాలో చెప్పులు వదిలేస్తూ రవి రాజేశ్వరిని పలకరించేడు. సుభద్రమ్మ వంగి అతనివేపు చూసింది. ఎండలో రావడంతో కందిపోయి ఎర్రబారిన మొహం, వుంగరాలు తిరిగి ముఖంమీద పడుతున్న జుట్టు, పచ్చని ఛాయతో అందంగా వున్నాడు రవి. ఇంత అందమైన పిల్లవాడు కనుకనే పిల్ల మనసుపడింది..... దరిద్రుడు, ఎంతపని చేశాడు.

వళ్ళు మండిపోయింది ఆమెకు. రవిని చూచేసరికి కోపం ఆగలేదు యశోదమ్మ నవ్వుతూ చూడగానే, ఒక్కసారిగా అరిచింది కోపంగా.

"ఏవమ్మా, నీకూ ఆడపిల్ల వుంది. ఆ పిల్ల సుఖంగా హాయిగా వుండాలని మీకెంత తాపత్రయం వుంటుందో నాకు మటుకు వుండదూ. నా పిల్ల, మీకేం అన్యాయం చేసింది. ఇంత గోలకు ఎందుకు పూనుకున్నాడు నీ కొడుకు. ఇదేమన్నా మర్యాదగా వుందా? మా కులమా? గోత్రమా? నేను నలుగురిలో తలెత్తుకోకుండా చేశారు..." ఏడ్చేసింది ఆవిడ.

యశోదమ్మ, మనోరమ నిర్ఘాంతపోయి చూస్తున్నారు. రాజేశ్వరి బిక్కచచ్చిపోయింది భయంతో. ఈవిడ ఇలా యుద్ధానికి తలపడుతుందనుకోలేదు. యశోదమ్మ తేరుకుని గావుకేక పెట్టింది.

"ఎవర్రా ఈవిడ? రవీ... ఏమిటి అంటుందీ?"

"ఊరుకోమ్మా.... అరవకు... తొందరపడవద్దు... నన్ను మాట్లాడనీ..." రవి లోపలికి వచ్చేడు. గ్రీకు శిల్పంలా వున్నాడు రవి.

"బాబూ నువు చక్కనివాడివి, తెలివిగలవాడివి. నా పిల్ల తొందరపడి వుంటుందేమో నాకు తెలియదు. నా పిల్లదాన్ని వదిలిపెట్టు, నీకు న్యాయం కాదిది.

వాళ్ళమీద ఆశలుపెట్టుకుని బ్రతుకుతున్నాను. మీరు తప్పు చేశారో, లేదో నేను చెప్పలేను. నలుగురితో పాటు పోవాలనుకుంటాను నేను. వర్ణసంకరం చేయడంలాటివి తలుచుకుంటేనే నాకు భయంగా వుంది. దానిజోలికి పోకు" ఆవిడ వలవలా ఏడుస్తోంది.

యశోదమ్మకు ఏం చేయాలో తోచటం లేదు.

"రవీ, ఏమిటిరా ఇది. ఏమయింది, ఎవరు ఈవిడ....ఎవరూ చెప్పరేమ్రా..."

"అమ్మా నువు కొంచెంసేపు మాట్లాడకు. నన్ను చెప్పనీయి. చూడండీ! మీరు అలా ఏడవకండి. లలిత అంటే నేను ఇష్టపడ్డాను. తనకూ ఇష్టమేనంది. పెండ్లి చేసుకుందామనుకున్నాం. నేను తనను మోసం చేయలేదు. అబద్ధాలు చెప్పలేదు. నేనేమిటో, నా ఇంటి పరిస్థితి ఏమిటో, అక్షరం, అక్షరం తెలుసు తనకు.

"ఏమిటి నాయనా తెలిసేది అభం, శుభం తెలియని పిల్ల అదింత పని చేసిందంటే, ఎంత మాయమాటలు చెప్పి వుంటే..."

"చిన్న మాటయినా, అనవసరంగా మాట్లాడకండి. ఎవరో ఏదో మోసం చేశారని ఆలోచిస్తారెందుకు? మాయమాటలు చెపితే మోసపోతుందా లలిత. పోయి లలితను కనుక్కోండి. ముందు చేయవలసింది ఆ పని.... వదినా, ఈమెను తీసుకుపో, లలిత ఏమంటుందో అడగండి ముందు."

యశోదమ్మ ఇప్పటికి తేరుకుంది.

"ఏమిటే రాజీ, ఎవరీవిడ? ఇంటికొచ్చి మరీ గొడవ చేస్తోందీ? ఆడది చనువు ఇవ్వకపోతే మగపిల్లాడు తొందరపడగలడా? ఎంత సిగ్గుమాలిన పిల్ల..."

'అమ్మా......' రవి అరిచేడు.

"ఒక్కమాటయినా లలితను అనవద్దు. ఇందులో ఆమె తప్పులేదు. నాకు ఇష్టమైంది. కుదిరితే పెండ్లి చేసుకుందామనుకున్నా.... ఒకవేళ లలితకు ఇష్టం లేకపోతే తప్ప నా నిర్ణయం సరిగానే వుంది. లలితను నువ్వు చూడలేదమ్మా. మంచిపిల్ల... ఎంత బాగా వుంటుందనీ....'

రాజేశ్వరితోపాటు గడపదాటుతున్న సుభద్రమ్మ వెనక్కు తిరిగి చూచింది.

అమ్మా.... ఒక్కమాటయినా, లలితను అనవద్దు...'

రవి మాటలు ఆమెకు కాళ్ళు ముందుకు సాగనీయకుండా చేశాయి. నడుం మీద చేయి వేసుకుని గుమ్మం పట్టుకుని నిలుచున్నాడు రవి. కోపంతో ముడుచుకున్న పెదవులు, విశాలమైన నుదురు, నల్లని జుట్టు, ముఖ్యంగా ఆ పిల్లవాడి కళ్లలో లలితపట్ల గల ప్రేమ, సుభద్రమ్మకు ఒక్క క్షణం తను పొరపాటు చేయడం లేదు గదా అనిపించింది.

❊ ❊ ❊

"ఒరే, నువ్వు వంద చెప్పు. ఆ పిల్లను నువు చేసుకుంటే నేనీ కొంపలో వుండను. వూరందరిదీ ఒక దారి, వులిపికట్టెది ఒక దారి అని, నువ్వు మొదటి నుంచీ మొండి వెధవ్వే. తలా ఒక మాట అంటార్రా. 'కులమంటే కోతి' అన్నారు. రేపు మామయ్య, బావ దాన్ని బ్రతకనిస్తారా. ఇప్పటికే మనం కట్నం ఇవ్వలేకపోయామని, తొందరపడి పెళ్ళి చేసుకున్నామని వదిన నన్ను ఎన్నిసార్లు సాధించిందో నీకు తెలియదూ?"

రవి విసుగ్గా చూచేడు.

"ఏమిటమ్మా గొడవ. నేను పెళ్ళి చేసుకుంటే, దాన్ని వాళ్ళు గొడవచేసేదేమిటి? నలుగురు, నలుగురు అని అస్తమానం ఎవరికోసమో బ్రతకాలని చూస్తావేం..."

"అంతేరా.... నేను నలుగురితో నారాయణ అనుకునేదాన్ని, ప్రత్యేకతలు, గౌరవాలు నాకు అక్కర్లేదు. నా పిల్లలు నలుగురిలాగా వుంటే చాలు. నువ్వా బ్రాహ్మణ పిల్లను చేసుకుంటే, రేపు అందరిలో మళ్ళీ ఇమడగలమా? చుట్టం పక్కం లేకుండా విశ్వామిత్ర చెట్టులాగా బతకాలి. నువ్వు కావాలనుకోవాలేగానీ మనలో మట్టుకు చక్కనివాళ్ళు లేరూ? ఇంతకంటె రంభలే దొరుకుతారు.... నువు లక్ష చెప్పినా, నేనీ పెళ్ళికి వప్పుకోను. తరువాత నీ ఇష్టం..."

యశోదమ్మ లేచి వెళ్ళిపోయింది. రవి మనోరమ వేపు చూశాడు. అతనికి అయోమయంగా వుంది. మనసుకు నచ్చిన ఆడపిల్లను పెండ్లాడేపాటి స్వతంత్రం కూడా లేదా? తల్లి ఎన్నోసార్లు పాత సిద్ధాంతాలు, ఆచార వ్యవహారాలు ఎంత అర్థం లేనివో చెప్పింది. రామకృష్ణ, రాజేశ్వరి ఎన్నోసార్లు తమ ఇంటి భోజనం చేశారు! వాళ్ళు భోజనాలు చేసినందుకు సంతోషిస్తూ తల్లి ఎంతో మురిసిపోయేది. ఏం కులాలు... రావుడు నాకు రవిలాగే కనబడుతాడు. బ్రాహ్మణ పిల్లాడే అనే అనిపించదు. ఆ పిల్లవాడికీ అలా వుండదు, అలా కలిసిపోయాం....' అంటూ కబుర్లు చెప్పిన తల్లి ఈవేళ తమదాకా వచ్చేసరికి వ్యతిరేకం చూపిస్తోంది.

మనోరమ నవ్వింది తమ్ముడి మొహం చూచి.

"బావుంటుందా ఆ అమ్మాయి?"

"ఇందాకటి నుంచీ అడగలేదే ఆ ప్రశ్న...."

"అమ్మో, అమ్మ చంపేయదూ, మీరందరూ ఒకటి, నేనొక్కదాన్ని అంటూ"

"ఎందుకంత భయం అమ్మే కదా...."

"అవుననుకో, ఎందుకో అమ్మను కష్టపెట్టబుద్ధికాదు. నన్ను అంటావుగానీ, నువు మట్టుకు అమ్మను ఏదయినా అనగలవూ..."

"అది వేరు..."

"ఏది వేరు... ఇంతకీ, నువు పెండ్లి చేసుకుంటావా ఆ అమ్మాయిని."

రవి విచిత్రంగా చూచేడు మనోరమ వేపు.

"అంటే నేనంత దుర్మార్గుడిలాగా కనబడుతున్నానా..."

"అబ్బే కాదులేరా, అమ్మ గొడవ చేస్తుందేమోనని అలా అన్నాను...." మనోరమ నొచ్చుకుంది.

"నెమ్మదిగా నచ్చజెప్పాలి..." అన్నాడు రవి.

"రవీ! నాకు అమ్మాయిని చూడాలని వుందిరా..."

"ఇప్పుడు ఎలా కుదురుతుంది..."

"ఒక్కమాట చెప్పు మనో.... నీకు నిజంగా ఇష్టమేనా... అమ్మలాగా భయమా?"

మనోరమ తలదించుకుంది.

'తనకు భయమా? స్వంత మేనత్తే అయినా, ఇప్పటికీ ఏ ముచ్చట్లు జరగలేదని తనను సాధిస్తూనే వుంటుంది. ఆమె దృష్టిలో ఎబార్షన్స్ కావడమూ తన తప్పే. ఎటొచ్చీ బావకు ఎదురు చెప్పలేక వూరుకుంటుంది కానీ...'

"రవీ భయం విషయం అవతల వుంచు. నీకు తెలియంది ఏముంది? అత్తయ్య మనల్ని ఏదో రకంగా సాధించేందుకు దారులు వెతుకుతూనే వుంటుంది. ప్రత్యేకంగా నాకు వచ్చే ఇబ్బంది మటుకు ఏమీ లేదు. నువు హాయిగా, ఆనందంగా బ్రతుకు. అంతే నే కోరుకునేది...."

"ఒకవేళ అమ్మకు ఇష్టం లేకపోయినా, పెళ్ళి చేసుకుంటున్నాననుకో, పెండ్లికి నీవు వస్తావా?"

మనోరమ వెంటనే మాట్లాడలేకపోయింది. కాసేపు ఆలోచించుకుంది.

"ఊహు.... బహుశా రాననుకుంటాను..."

తన సమాధానానికి తనకే గొంతు పట్టేసినట్టుగా వుంది.

రవి నిట్టూర్పు విడిచేడు. తల్లినీ, అక్కనీ బాధ పెట్టాలని అతని వుద్దేశ్యం ఎంత మాత్రమూ కాదు. తండ్రిపోయిన దగ్గరనుంచి తమ మీదే ప్రాణాలు పెట్టుకుని బ్రతికే తల్లిని కష్టపెట్టాలని లేదు.

'నన్ను మరిచిపోతావా రవీ...'

లలిత ఎదురుగా వుండి అడుగుతున్నట్లే వుంది.

* * *

"వర్షం వచ్చేలా వుంది. ఇవాళ వెళ్ళకపోతేనేం..." అన్నది యశోదమ్మ.

"ఒక్కదానివి వెళతానంటావు? వంట కాగానే ఇద్దరం రిక్షాలో పోదాం" అన్నది మళ్ళీ.

"వద్దులే నే వెళతాను. వెళ్ళగలనులే.....సిల్క్ ఎంపోరియంలో శారీ ఫాల్స్ తీసుకోవాలి. నేను వెళతాలేమ్మా...." అన్నది మనోరమ.

రోడ్డుమీదకు వచ్చేసరికి చల్లని గాలి వీస్తోంది. హాయిగా వుంది ప్రాణం. బజారంతా సందడి. అలా హడావుడిగా, ఎక్కడకు పోతారా వీళ్లు అనుకొంది నవ్వుకుంటూ. ముందుగా సిల్క్ ఎంపోరియంలో ఫాల్స్ తీసుకుని, అటునుంచి హాస్పటల్‌కు వెళ్ళి రిక్షాలో ఇంటికి పోవచ్చు అనుకుని అటు నడక సాగించింది.

మనోరమ పరధ్యానంగా నడిచి వస్తోంది. రెగ్యులర్‌గా ఇంజక్షన్లు తీసుకోవాలన్నారు డాక్టరు. కొంచెం నడిస్తే బావుంటుంది కదా, అస్తమానం పడుకోవాలన్నా విసుగే కదా అనుకొని రోజూ మనోరమ హాస్పటల్‌కు నడిచి వెళ్ళి వస్తోంది సాయంకాలం వేళల్లో. ఇంట్లో గొడవ మూలంగా మనశ్శాంతి లేదు. ఈ గొడవంతా మీ అత్తకి తెలుస్తే ఏమవుతుందో అని తల్లి ఏడుపు. ఏమవుతుంది? మాధవ్‌కు ఇవేం పట్టవు. అతని ఉద్యోగం, మనోరమ అంతే. ఎబార్షన్స్ అవుతున్నాయని ఆమెను – 'పిల్లలు లేకపోతేనేం హాయిగా ఆపరేషన్ చేయించుకో. ఎవరినైనా పెంచుకుందాం' అంటాడతను. కానీ తనకే మనసొప్పదు. తన పాప వుండాలి. అమ్మా అనే పిలుపులోని తియ్యదనం తనూ అనుభవించాలని, మాతృత్వంలోని సహజమైన ఆనందం అనుభవించాలన్న కోరికే ఇలా ఇవన్నీ ఓర్చుకొనేలా చేస్తోంది. కానీ అదేమిటో, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, నెలలు నిండకముందే ఇలా అవటం ఆమెకు మానసికంగా ఎంతో వేదనగా వుంది.

* * *

"రవీ నీ కోసం ఎవరో అమ్మాయి వచ్చింది."

బయటనుంచి మెకానిక్ ప్రకాశం కేక వేశాడు. పరధ్యానంగా బాల్కనీలో కూర్చుని బద్ధకంగా కదులుతున్న మబ్బుల్ని చూస్తున్న రవి వులిక్కిపడి లేచి బాల్కనీలోంచి క్రిందకు చూశాడు.

వైర్ బాగ్ చేతిలో పుచ్చుకుని లలిత నిలబడి వుంది. ఒక్క క్షణం గుండె గొంతులోకి వచ్చినట్లయింది రవికి. పరుగెత్తుతున్నట్లు మెట్లు దిగి వచ్చేడు. లలితను చూచి అప్పుడే పది రోజులయిపోయింది. ఎలా తనను చూడటమా అని తల బద్దలు కొట్టుకుంటుంటే దయతలచి సాక్షాత్కరించిన దేవతలా కనబడింది లలిత.

"ఎప్పుడు వచ్చేవు లలితా?" చేతిలో బేగ్ తీసుకున్నాడు.

'ఇప్పుడే' అన్నట్లు తల వూగించింది. చెవులకున్న జూకాలు, గమ్మత్తుగా వూగేయి.

"పద వెళదాం" అని – "ఇదిగో ప్రకాశం, మా వాళ్ళమ్మాయిని ఇంటిదగ్గర దింపేసి వస్తాను. నేను వచ్చేదాక ఇక్కడే వుంటావుగా."

సమాధానం కోసం చూడకుండా ముందుకు నడిచేడు రవి.

"ఎక్కడికి వచ్చావు లలితా..."

"నీ దగ్గరికే" లలిత కిలకిలా నవ్వింది.

"ఎంత సంతోషం వచ్చిందో పాపం. మొన్న అమ్మ వచ్చినప్పుడు అందరికీ గుడ్డలు తీసుకొంది. నా జాకెట్లకోసం తీసుకొన్న ముక్కలు వున్నాయికదా వాటిల్లో ఐదేసి పాయింట్లు కత్తిరించి పారేశా. ఇప్పుడవి జాకెట్టుకు చాలవుగదా... వెంటనే తెచ్చుకుంటాను ఇవి మార్చి అని చెప్పి వచ్చాను. అమ్మకు నన్ను పంపటం ఇష్టం లేదు. కానీ తప్పలేదు. పొలంలో వడ్లు కుప్పకొడుతున్నారు. అక్క దగ్గరకెళతాను అని చెప్పేసి వచ్చేను."

రవి పకపక నవ్వాడు.

"ఎంత పని చేశావు లలితా. అవి చాలవు కదా మరి వేస్టయిపోవూ?"

"పోనీ, మరి నిన్ను చూడాలనిపించింది."

తళ, తళ మెరుస్తున్న ఆ పిల్ల కళ్ళవంక ఒక్కసారే చూచాడు రవి, ఇంత చిన్న పిల్ల ఎంత పనిచేసింది. ప్రేమకు ఇంత శక్తి వుందా!"

"ప్యార్ అమర్‌హై దునియా మే"

"ప్యార్ కభీ నహీ మర్‌తా హై"

రఫీ గొంతు ఏ కొండ లోయల్లోనుంచో ప్రతిధ్వనించినట్టు అనిపించింది రవికి.

"రవీ! అమ్మకు నన్ను పంపాలంటే ఎంత భయం వేసిందో తెలుసా? ఏడ్చి అలక సాగించి మరీ వచ్చాను...ఆ" అంది లలిత నవ్వుతూ.

లలిత చేయి తన చేతిలోకి తీసుకున్నాడు రవి.

"అబ్బ... ఇంత మంది జనం ఏమిటీ.... ఇలా తిరక్కపోతే హాయిగా ఇళ్ళకుపోయి పడుకోకూడదు" అన్నాడు.

"వాళ్ళు తిరిగితే నీకేం, వాళ్ళ కాళ్ళుపెట్టి వాళ్ళు తిరుగుతారు."

"వాళ్ళు తిరగటం కాదోయ్ నా బాధ, ఎంతో డిస్టర్‌బెన్స్ వీళ్ళ మూలంగా. వాళ్ళంతా ఇళ్ళలో రెస్టు తీసుకొంటున్నారనుకో కాసేపు. మనం హాయిగా నవ్వుకోవచ్చు.

పరుగులు తీయవచ్చు. వీలయితే నువు నాకో స్వీట్ కిస్ ప్రజంటు చేయవచ్చు. ఎన్ని ఆపర్ట్యునిటీస్ వున్నాయనీ ఇందులో."

"ఛీ....పో..." లలిత సిగ్గుగా నవ్వింది.

అదిగో వూరికే నవ్వుతున్నావుగానీ, అసలు కవిగారు ఏమన్నారంటే -

"ఆడవారి మాటలకు అర్థాలు వేరులె....

ఔనంటే కాదనిలే.. కాదంటె ఔననిలె..."

రాగం తీశాడు రవి.

లలిత దిక్కులు చూసింది. "ఎవరైనా వింటారు బాబూ"

"ఎవరమ్మా వినేది, ఎవరిగోల వాళ్ళది. నేనేం ఘంటసాలనో, బాలసుబ్రహ్మణ్యాన్నో లేదా ఏకంగా మంగళంపల్లి బాలమురళీకృష్ణనో అయితేగా, జనం ముగ్ధులైపోయి నావంక చూట్టానికి"

"అలా కాకుండా, అబ్బ ఏమిటంత ఘోరంగా పాటలు ఖూనీ చేస్తున్నాడని చూడవచ్చును గదా.."

"అన్యాయం, సినిమాల్లో అయితే హీరో పాట మొదలెట్టగానే హీరోయిన్ వెర్రి పరుగులు తీస్తూ, సంతోషించి డాన్సులు చేస్తుంది కదా. నువ్వు చూడు మన రాగానికి పేరు పెడుతున్నావు."

"నువు అన్నట్లు హీరో పాడగానే హీరోయిన్ పరుగులు తీసేది ఆ రాగాలు వినలేకనేనయ్యా.... ఇంతకీ నన్నిలా ఎంతసేపు ఎంత దూరం నడిపించదలుచుకున్నావు?"

"ఇదిగో మొట్టమొదట నీ జాకెట్లు సిల్క్ ఎంపోరియంలో కొనేసి, టిఫెన్ చేసి, ఆ తరువాత కోవెలకు పోదాం..."

* * *

సిల్క్ ఎంపోరియం దగ్గరకు వచ్చేసరికి మనోరమకు నీరసం ముంచుకొచ్చింది.

'ఏమిటి? మరీ నడవలేకపోతున్నానూ? వన్ వే ట్రాఫిక్, రిక్షాలు రావు, వెనక్కి తిరిగి ఇంతదూరం నడవటం ఎలాగా అనుకుంటూ, దిక్కులు చూస్తూ నిలబడింది ఒక్క క్షణం. అటు నుంచి రవి సిల్క్ ఎంపోరియంలోకి వెడుతున్నాడు. పళ్ళ దుకాణాలు అడ్డంగా వుండటంతో మనోరమను చూడలేదతను.

'రవీ' అని కేక వేయబోయి ఆగిపోయింది. మనోరమ.

రవి ఒక్కడేకాదు వెనకాలే ఇంకో అమ్మాయి వుంది. చేతులు తిప్పుతూ, కబుర్లు చెప్తోంది ఆ అమ్మాయి. ఆ పిల్లవంకే చూస్తూ కబుర్లు వింటున్న రవిని చూచాక

రవిని పిలిచి వాళ్లని కంగారు పెట్టదలచుకోలేదు మనోరమ. సిల్క్ ఎంపోరియం లైట్ల వెలుగులో లలిత తీర్చిదిద్దిన ప్రతిమలాగా వుంది. రవి పక్కన వుంటే ఇద్దరూ చూడముచ్చటగా వున్నారు.

ఫాల్స్ రేపు తీసుకోవచ్చులే అనుకొని వెనక్కి తిరిగింది మనోరమ. అక్కడి నుంచి నడుస్తూ ఓవర్ బ్రిడ్జి దగ్గరకు వచ్చేసరికి చినుకులు మొదలయ్యాయి. బ్రిడ్జి క్రింద నుంచి రోడ్ దాటి ప్రక్క సందులోనే వున్న 'వాసవీ క్లినిక్'లోకి వెళ్ళింది. వరండాలోకి వెళ్ళేసరికి వర్షం పెరిగిపోయింది. వెండి దారాలు సాగదీస్తున్నట్లుగా మెరుపుల వెలుతురులో వర్షం నీళ్ళు మెరుస్తున్నాయి చూస్తుండగానే మబ్బులు కమ్మేశాయి. డాక్టర్ వాసవి వరండాలోనే వుంది. రూమ్స్‌లోంచి తిరిగి వస్తూ వర్షం పెద్దదయిపోయేసరికి వరండాలోకి వచ్చింది గబగబా. మనోరమని చూచి చిరునవ్వు నవ్వింది.

"ఇంకానయం తడిసేవు కాదు. అసలే అంతంతమాత్రంగా వుంది ఆరోగ్యం. కన్సల్టేషన్ రూమ్‌లో కూర్చో పో, నేను వస్తున్నాను. చలిగా వుందిక్కడ."

వాసవికి, మనోరమకు మంచి స్నేహం వుంది. మాధవరావుకి మనోరమ అనారోగ్యం వల్ల వాసవి బాగానే పరిచయం. బిల్లు వందల్లో వేసినా ఇష్టంగానే ఇస్తాడు. 'ఈవిడ ఎంత దయగా వుంటుందో. విసుక్కోవటం కూడా చూడలే. ఇలాటి వ్యక్తులు నూటికొక్కళ్ళు వుంటారు.'

మనోరమ ఆలోచనలు పూర్తికాకముందే వరండాలోంచి పెద్ద పెద్దకేకలు వినబడ్డాయి. తొంగి చూచింది. అనుమానంగా తెలిసిన గొంతులాగా వుంటే కేకలు వేస్తోంది వాసవి. ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసింది మనోరమ. ఇంతకు ముందేకదా, డాక్టరుకి కోపం లేదనుకుంది. బాబోయ్, ఇంత గొంతుతో అరుస్తోంది. లోపలికిపోయి కూర్చోమని, చలిగాలిగా వుంది అని చెప్పిన గొంతేనా ఇది....

"తల్లీ... తల్లీ.....అంత మాటనకు. మా శక్తికొద్ది ఇచ్చుకున్నాం, పిల్లది, తల్లిలేనిది. మా పిల్లదాన్ని ఓపికచేసుకొని, ముసిలిదాన్నయినా కూతురి బిడ్డని తల్లిపోయిన దగ్గరినుంచి సాక్కొచ్చా.... దయసూపించు తల్లీ..."

చంటిపాపను ఎత్తుకుని మనోరమ వయసుపిల్ల వరండాలో బల్లమీద కూర్చుని వుంది. ఎర్రగా, సన్నగా, బలహీనంగా వుంది. పేదరికం కొట్టవచ్చినట్టు కనబడుతోంది.

"ఇదిగో మాట్లాడకు, ఏం మనిషివి నువ్వు. నేను అప్పుడే చెప్పేను. పిల్లా... నీతో చెప్పలే?"

ఆ పిల్ల తల వూపింది. పెద్ద పెద్ద కళ్ళెత్తి చూస్తోంది. ప్రాణం పోయే నరక యాతన వుంది ఆ రోజు. రెండు రోజులైంది నెప్పులు మొదలయి అప్పటికి. సర్వ

శక్తులు హరించిపోయి ప్రాణావశిష్టంగా వుంది ఆ పిల్ల ఆ రోజు. ఆ బాధతో ఏం చెపుతుంది.

"ఇంజక్షనులు అవీ చేస్తున్నా, కుట్లు పడతాయి, మందులు నా దగ్గరవి వాడమంటే వాడతా. లేదా మీరు తెచ్చుకోండి. ఒకేసారి బిల్లు కడతామని చెప్తివే. మీ ఇష్టం తల్లీ అంటివే, తుమ్మమొద్దు నుంచున్నట్లు నుంచుంటావే, చెప్పు సమాధానం" వాసవి గద్దిస్తోంది.

"నే కాదన్నానా తల్లీ... నీ సల్లటి సేత్తో పురుడుపోశావు. బిడ్డ బతికి బట్ట కట్టింది. నీ రుణం ఈ జలమకి తీర్చుకోలేని ముసిలిదాన్ని. సిన్న బిడ్డని సేతిలో పెట్టి సచ్చిపోయింది నా కూతురు. కళ్ళల్లో బెట్టుకొని పెంచుకొచ్చా, తండ్రి వున్నా మారు మనుం సేసుకొనిండు. బిడ్డ నెప్పులకి అల్లాడిపోయింది. కానుపు టయంకి నావల్ల కాదంది మంత్రసాని.ఏం జేసేది అమ్మా ఈ వందా వుంచుకో.... అమ్మా..."

"మాట్లాడేవంటే స్తంభానికి కట్టేస్తాను. వంద రూపాయలు ఇస్తావా నాకు. థియేటర్లోనే వంద రూపాయల మందులు వాడేను. వారం రోజులై రూములో వున్నారు. ఖబడ్దార్, జాగ్రత్త ముందు డబ్బక్కడ పెట్టి కదులు."

"ఓమ్మా.....దొర్సానీ ఇంతకంటే యాడ దెచ్చేను. రూముకి డబ్బులు నర్సమ్మకిస్తిని. అడుగు. ఇంకా ఆళ్ళకి ఇయ్యాలని పీకుతా వుండారు. కానుపుకి పదిహేను ఇవ్వాలని. తల్లిలేని బిడ్డ...."

"తల్లిలేని బిడ్డయితే నన్నేం చేయమంటావు. దీన్నిపోయి చావమను, నాకేం ముందుగా ఈ ఏడుపు ఏడిచారా... తీరా పని అయిపోయాక మొండిచేయి చూపెడతావా? జాతి లక్షణం చూపెట్టుకున్నావు. ఎక్కడకు పోతాయి తక్కువ మనుషులు, తక్కువ బుద్ధులు..."

బల్లమీద కూర్చున్న పిల్ల రోషంగా తలెత్తింది.

"ఎందుకు అంతంత మాటలు డాక్టరమ్మా"

"ఓయ్! రోషం పొడుచుకొని వచ్చిందే పిల్లకు, పారేయ్ రోషంగలదానివి నా డబ్బు"

ఆ పిల్ల చుట్టూ చూసింది.

ఎదురుగా వుంది నీళ్ళ బిందె "అమ్మా పోయి ఈ బిందె అమ్మిపారేయి. ఆ డబ్బు కట్టేయవే పోదాం" అరిచినట్టు అంది ఆ పిల్ల.

"ఆ బిందెనా... అమ్మో..."

"ఏం.... అయితే.... మళ్ళీ మాగాట్లో కలుపులు అయేసరికి కొనుక్కుంటాం పో."

"అమ్మో! నీ మొగుడు బిందె అమ్ముకొన్నామని అంటాడే బేటా."

"అందుకే పనికిపోతాపో, పనులే దొరకవా?"

"బాలింతవి, కలుపులుకి ఎల్లా పోతావే...."

"నువు ముందుపో..."

ముసలిది బిందె తీసుకుని బయటికి పోయింది.

"నాకేమిటో దీని ధర్మం ఇచ్చినట్టు నీలుగుతుందేమిటి?" వాసవి గొణుక్కుంటూ లోపలికి వచ్చింది. మనోరమని చూడగానే పెదవుల మీదికి నవ్వు వచ్చింది.

"ఏం మనూ ఆలోచన... నర్స్, మనోరమ టెంపరేచర్ చూడు. ఇంజక్షన్ తీసుకురా నేను చేస్తాను. ఏమిటి దీర్ఘాలోచన, మాధవరావుగారి గురించేనా?"

మెత్తగా నవ్వుతోంది వాసవి. మనోరమ నిర్ఘాంతపోయి చూస్తోంది అప్పటిదాకా. మనోరమ వాసవిని చూసి బలవంతంగా చిరునవ్వు నవ్వింది.

"నువు వానలో పోవద్దు మనూ. బాయ్‌ని పంపి రిక్షా తెప్పించుకో. నాకు థియేటర్‌లో ఆపరేషన్ వుంది. పేషెంటు రడీగా వుంది. వాసవి చకచకా నడుస్తూ వెళ్లిపోయింది.

వాసవి బయటికి వచ్చేసరికి వర్షం తగ్గిపోయింది. మబ్బులు తేలిపోయాయి. క్షణంలో ఎంత వర్షం కురిసిందో అనుకొంది మనోరమ. బ్రిడ్జి దాటి రోడ్డుమీదకు వచ్చాక రిక్షాలో పోవచ్చులే అనుకొంది. వర్షం నీరంతా మెరకగా వున్న రోడ్డు మీద నుంచి బ్రిడ్జి క్రిందకు ప్రవహిస్తోంది.

కేరు, కేరు మని చిన్న పాపాయి ఏడుపు.

ఉలిక్కిపడి చుట్టూ చూసింది మనోరమ. ఎక్కడో చిన్న పాప ఏడుపు, నెలల పాప అయివుంటుంది. దిక్కులు చూస్తున్న మనోరమ గుండె జల్లుమన్నట్లు ఆగిపోయింది.

ఎవరో అడుక్కునే మనిషి బ్రిడ్జి క్రింద నీళ్ళలో పడి వుంది. చిన్న చంటిపాప, మోకాళ్ళమీద నీళ్ళలోంచి లేచి, తల్లి గుండెల మీద తల వాల్చి ఏడుస్తోంది. ఏడెనిమిది నెలలు వుంటాయి. నీళ్ళు పల్లంవేపు వేగంగా వస్తున్నాయి. పల్లంలో బ్రిడ్జి క్రింద నిలిచిపోతున్నాయి. మనోరమ గుండెలు దడదడ లాడేయి.

కొంచెం ముందుకు నడిచి "అమ్మాయ్.... అమ్మాయ్" అని పిలిచింది. పడిపోయి వున్న మనిషి పలకలేదు.

చుట్టూ దరిదాపుల్లో మనిషి అన్నవాడు కనబడలేదు. పాపాయి క్షణం క్షణం

ఏడుపు పెంచుతోంది దిక్కులు చూస్తూ, పిల్ల మురికిగా వుంది వళ్ళంతా బురదతో, అక్కడంతా దుర్వాసన.

ఎత్తుకొనేందుకుగానీ, దాటిపోయేందుకు గానీ మనస్కరించలేదు. అమ్మో చిన్నపాప. చచ్చిపోతుందేమో, తల్లి చనిపోయినట్టే వుంది, కదలక మెదలక పడివుంది. నాకు ఎన్నిసార్లు ఎబార్షన్స్ జరిగేయి. ఒక్క చిన్న పాప అయినా బ్రతికి వుండకూడదూ?"

"ఏం బ్రతికి లేకపోతే చావటానికి సిద్ధం అయిపోతున్న పాపాయిని వేగం తీసుకో" అంది మనసు.

"ఈ పిల్లనా అమ్మో... మాధవరావు చంపేయడూ, నీకుతోడు ఈ ముష్టిపిల్లా అని అత్తయ్య బయటికి గెంటదూ...?'

ఒక్క పరుగుతో రోడ్డుమీదకు పోయి నిలుచుంది.

వెనక్కి తిరిగి చూస్తే ఏ అచ్ఛాదనలేని తల్లి గుండెలమీదపడి పాలకోసం దేవులాడుతోంది పిల్ల. తల్లిలో చలనం లేకపోయేసరికి ఏడుస్తోంది. ఏం చేయాలి?

మనసున్నా మార్గం లేదే. అదే స్థితిలో ఒక మగవాడుంటే ఏదో ఒక నిర్ణయం తీసుకొంటాడు కదా! కట్టు బానిసలాంటి ఆడది ఏం చేస్తుంది? వణుకుతున్న పెదవులు, పళ్ళతో బిగించి గబగబా అడుగులు వేసింది మనోరమ. చెవుల్లో మారుమ్రోగుతోంది ఏడుపు.

"బావుందే నువు చెప్పేది. దారినిపోయే తద్దినం పిలిచి నెత్తిన ఎక్కించు కొన్నాడట ఎవడో నీలాటివాడే, తాదూర కంత లేదు, మెడకో డోలన్నారు. ఇప్పటికీ మొగుణ్ణి చూస్తే కాళ్ళు వణుకుతాయ్ అమ్మకి. ఈవిడ ముష్టి బిడ్డని తెచ్చి సాకుతుందిట... వినండి..."

"అమ్మా.... అట్ల అనకే చిన్నపాపే, చచ్చిపోతుందేమోనే, ఇక్కడ వుండే వంతెన క్రింద. అయ్యో, చచ్చిపోతుందేమో, ఎవరూ పట్టించుకోలేదు. నా బిడ్డ ఒక్కరైనా బ్రతికి వుంటె, అల్లా నీళ్ళల్లోకి పోనిస్తానూ...నీళ్ళలో సగందాకా మునిగి వుందమ్మా..."

మనోరమ, చిన్నపిల్లలాగా గుమ్మంలో కూలబడి వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆ అమ్మాయి అల్లా ఏడవటం చూచి నిర్ఘాంతపోయి చూస్తోంది యశోదమ్మ. ఈ పిల్లల పిచ్చిలోనే ఇది పిచ్చిదయిపోతుందేమో, భయంగా వుంది ఆమెకు. కానీ, ఎవరో అడుక్కుతినే పిల్లని తెచ్చి మనోరమకి ఇచ్చే ధైర్యం లేని మామూలు మధ్యతరగతి మనిషి ఆమె.

బయట చెప్పులు విప్పుతున్న రవి ఏడుపు విని లోపలకు అలాగే పరిగెత్తుకు వచ్చాడు.

"ఏమయింది మను. ఎందుకమ్మా ఏడుస్తుంది అక్క..." ఆదుర్దాగా అడిగేడు రవి.

గాజుబొమ్మలాంటి అక్కగారంటే చెప్పలేనంత ఇష్టం, జాలి రవికి. అసలే అనారోగ్యంగా వున్న మనిషి, ఎందుకు ఏడుస్తోందో గుండె దడదడ లాడింది అతనికి.

మనోరమ ఒక్కసారి లేచింది.

"రవీ... పాపాయిరా.... చిన్న పాపాయిరా, ఆ బ్రిడ్జి క్రింద వుంది. ముష్టి మనిషి ఎవరో పోయిందిరా, వాళ్ళ పాపాయి. బురదలో వుంది. నీళ్ళలో మునిగిపోతోంది. రవీ నే చూడలేకపోయానురా... ఆ పాపే నా పాప అయితే ఎంత బావుంటుందిరా, నిష్కారణంగా చచ్చిపోతోందిరా..."

కంట్రోలు తప్పిపోయి బిగ్గరగా ఏడుస్తోంది మనోరమ. వెంట వెంటనే ఎబార్షన్స్ అయిపోవటం, పుట్టిన బిడ్డలు పోవడం మనోరమ మరీ దిగజారిపోయింది. పిల్లలంటే సహజంగావుండే మమకారం ఆమెను తల్లక్రిందులు చేస్తోంది.

మనోరమ ఏడుపుకి రవికి కళ్ళనీళ్ళు తిరిగేయి.

"ఇదేమిటిరా ఆ ఏడుపు. ఎంతమంది పోవటం లేదూ. మనం ఏం చేయగలం? ఆ ముష్టిపిల్లని తెచ్చుకొంటాననటుందేమిటిరా? దీనికి మనసు చెడిపోయింది" యశోదమ్మ అన్నది విసుగ్గా.

రవి మనోరమ వేపు తిరిగేడు.

"మనూ పాపను నువు పెంచుకుంటావే?"

"ఒరేయ్, నీకూ పిచ్చి పట్టిందా? అది ఏడవటం, నువు తెచ్చిపెట్టటానికి అదేం పండో, వస్తువో అనుకున్నావా? మతిలేని వెధవా..."

రవి సూటిగా తల్లివేపు చూశాడు.

"ఏం పెంచుకొంటే, దానికి ఇష్టమయితే పెంచుకొంటుంది. మధ్యలో నీకు బాధేమిటి?"

"ఒరే నువు వాగకు. మీరు ఇలాంటి వెధవ పనులు చేస్తే నేనా కాలవలో దూకి చస్తాను ముందు. ఉద్ధరించేవాళ్ళు బయలుదేరారు."

"ఛీ..."

అన్న ఒక్క ఛీత్కారం చేసి బయటకు పోయాడు రవి. పరుగెత్తుకుంటూ బ్రిడ్జి దగ్గరకు పోయాడు. అప్పటికే జనం మూగి చూస్తున్నారు. పాపం ఏడ్చి ఏడ్చి గొంతు జీరపోయింది. నీళ్ళు నిలిచే వున్నాయి పిల్ల చుట్టూ. ఆ బురదలో పడివుంది తల్లి శవం. అందరూ కాసేపు చూసిపోతున్నారు కాస్త జాలిపడి. రవి ప్రక్కనే వున్న మెడికల్

షాపులోకి పరుగెత్తేడు. మునిసిపాలిటీకి ఫోన్ చేసి శవం వుందని చెప్పాడు.

'నిత్య సహాయ మాత మందిరం' వుంది అనాథ బాలల కోసం. అక్కడకు ఫోన్ చేశాడు. అక్కడ వున్న సిస్టర్ ఫోన్ తీసింది. "నమస్తే సిస్టర్ ఇక్కడో బేబీ వుంది. బ్రిడ్జికింద వుంది సిస్టర్. తల్లి చనిపోయింది. ఏడవలేకపోతోంది. పాపం. మరీ చిన్నది మీరు రాగలరా సిస్టర్."

"వేన్ రడీగా లేదు. మై డియర్ సన్. రాగానే వస్తాను. మే గాడ్ బ్లెస్ యూ" అన్నది సిస్టర్.

"అప్పటికి పాప బతికి వుంటుందా సిస్టర్. పోనీ నేను తీసుకువచ్చేదా సిస్టర్."

"విత్ ప్లజర్ మై బాయ్..... ఇంత శ్రద్ధ తీసుకొంటున్నావు ఒక ఆర్ఫన్ కోసం. రియల్లీ యు ఆర్..."

ఫోన్ పెట్టేశాడు రవి.

ఖాదీ భాండార్‌లోకి వెళ్ళి ఒక టవల్ తీసుకున్నాడు. రిక్షాని కేక వేశాడు. పాప మొత్తం మురికితో వుంది. వంటిమీద గుడ్డ పీలిక కూడా లేదు. వళ్ళంతా మట్టి, తను తెచ్చిన టవల్‌తో ఆ పిల్లను చుట్టి చేతుల్లోకి తీసుకున్నాడు రవి. ఆ పాప బలహీనంగా కళ్ళెత్తి చూచింది రవిని. ఏడ్చే ఓపిక లేదు పాపం. చుట్టూ అందరూ నిర్ఘాంతపోయి చూస్తున్నారు అతనిని. రిక్షావాడికి అడ్రసు చెప్పాడు.

"ఇంతమంది సూస్తావుంటే నీకెందుకయ్యా శ్రమ" అన్నాడు రిక్షా అతను.

"మనిషిని కాబట్టి..."

ఒకప్పుడు సమాజం కోసం పాటుపడేవాళ్ళు. తరువాత సమష్టి కుటుంబం కోసం, ఆ తరువాత వ్యష్టి కుటుంబం వచ్చింది ఆలోచనలోకి. నేనూ నా భార్యా పిల్లలు అంతవరకే పరిధి. ఇంకా కొంతకాలం పోతే, నేను ఒక్కణ్ణే సుఖపడితే చాలు అనుకొనే ఆలోచన వస్తుందేమో మనిషికి. నిట్టూర్చాడు రవి.

* * *

"టవల్ తెచ్చి ఇస్తావూ..." లోపలికి కేకవేశాడు రవి.

"అదేమిట్రా మురికి వళ్ళంతా, పడ్డావా?"

"ఆ పిల్లను ఆర్ఫనేజ్‌లో ఇచ్చి వచ్చాను" అన్నాడు రవి.

"ఏమిట్రా! ఆ పిల్లను ముట్టుకొన్నావా? ఆ తల్లిని ముట్టుకొని....ఎంత అఘాయిత్యం మనిషిరా? అందరూ పెద్దవాళ్ళే కొంపలో. వూరంతా ఒక దారయితే వులిపికట్టెది ఒకదారనీ, అల్లా వుంది చూడబోతే. షాంపూ తీసుకువస్తా. నెత్తిన తగలబోసుకో. తిట్టుకుంటూ పోయింది ఆమె.

మనోరమ పరుగెత్తి వచ్చింది. కళ్ళలో నీళ్ళు వున్నాయి ఆమెకు.

"ఎంత మంచిపని చేశావురా. నాకా ఆలోచనే రాలేదు. ఏడవటం తప్ప ఏం చేయాలో తోచలేదు."

"ఇంకా నయం. ఆ పిల్లను కొంపలోకి తేకుండా, మనం అడవిలో బ్రతుకుతున్నామా రవి. చుట్టూ జనం వున్నారు. ఎవరు ఏమనుకుంటారోనని కాస్త వుండాలి మనిషికి."

అక్క తమ్ముళ్ళిద్దరు తల్లివేపు చూచేరు. ఆమె స్వతహాగా చెడ్డది కాదు. సమాజం ఏమంటుందోనన్న భయం ఆమెకు.

స్నానం చేసి, భోజనం చేసి ఆరు బయట మంచం వేసుకొని పడుకున్నాడు రవి, మబ్బులు తేలిపోయి చల్లని వెన్నెల వచ్చింది. ఎక్కడికో హడావుడిగా పరుగులు తీస్తున్నాడు చంద్రుడు. అతన్ని దాచేయాలని చూస్తూ అతని వెనకాలే మబ్బులు.

"ఆతాహై చంద్రమా రాత్ ఆయీ"

చిన్నగా పాడుతున్నాడు రవి. లలిత గుర్తుకొచ్చింది. ఇంత భయస్తురాలు తల్లి. లలితను ఈ ఇంటికి అమ్మను నొప్పించకుండా తేవటం ఎలా?

మనోరమ సరిగా ఇదే ఆలోచిస్తోంది.

ఇంత సహృదయంతో వుంటాడు రవి. అతడు ఇష్టపడ్డ పిల్ల ఈ ఇంటికి కోడలు కావాలి. అమ్మను ఏవిధంగా ఒప్పించాలి? అదే ఆలోచన.

* * *

పేపరు చూస్తోంది మనోరమ. పేపరంతా ఎన్నికల విశేషాలమయం. ఎవరి పార్టీ గురించి వారు గప్పాలు కొట్టుకోవటం, ఎదుటివారిని దూషించటం, వీలుంటే ఎదుటి పార్టీవాడి నెత్తిన రాళ్ళు వేయటం. నవ్వుకొంటూ చూస్తోంది పేపరు.

రాజేశ్వరి వచ్చింది నెమ్మదిగా.

"ఓయ్... రాజీ, అమ్మా.... రాజీ వచ్చిందే" కేక వేసింది మనోరమ.

"కోపం పోయిందా?" నెమ్మదిగా అడిగింది.

"ఎవరికీ కోపం! ఎందుకు?"

"వుష్" ముక్కుమీద వేలుంచుకుని సైగ చేసింది రాజేశ్వరి అమ్మ వింటుంది అన్నట్లు.

"ఏమే రాజీ, మొన్న అదే పోత పోయాడు రావుడు, పల్లెకు పోయాడా?"

"లేదత్తయ్యా" నసిగింది రాజేశ్వరి.

"పిల్లాడేడీ....?"

"లలిత ఇంట్లో వుంది" అని నాలుక కరుచుకొంది రాజేశ్వరి.

"ఆ పిల్ల మీ ఇంట్లోనే వుందన్నమాట" అదోలా అంది యశోదమ్మ.

"లేదత్తయ్యా! ఉదయమే వచ్చింది. రేపు వెడుతుందేమో..."

"ఆహా...." అంది ముక్తసరిగా.

"నువు మనూతో మాట్లాడుతూ వుండు . నాకు పొయ్యిమీద కూర వుంది. నీకూ వంటచేస్తా. వెళ్ళొద్దు..." వెళ్లిపోయింది ఆమె.

తల్లి లోపలికి పోవడం చూచి, మనోరమ రాజేశ్వరిని గదిలోకి రహస్యంగా రమ్మని పిలిచింది.

"లలిత.... అంటే ఆ అమ్మాయి కదూ... రవీ...." అర్థాంతరంగా ఆగిపోయింది. ఎలా అడగాలో తెలియలేదు.

"ఆ అమ్మాయే. నువు చూచావా మనూ..." అంది రాజేశ్వరి.

తల వూపింది మనోరమ. "దూరం నుంచి చూచాను, చక్కగా వుంది. అటు వాళ్ళకి, ఇటు వీళ్ళకి ఎవరికీ ఇష్టం లేదు. ఎలా వీలవుతుందీ? కులాంతరం అంటే మనం మరీ అంత ఎదగలేదు కదా..." నవ్వింది మనోరమ.

"మనం అని చేర్చకు. లలితకు, రవికి ఇష్టమే కదా. రామన్నయ్యకు వాళ్ళిద్దరూ ఒకటి కావాలని ఎంత సరదానో చెప్పలేను. నాకు సరిగా, పది రోజులు పాఠాలు చెప్పేరు. కులం ఏమిటి పిచ్చిదానా? అంటారు వదినా."

మనోరమ ఆలోచనలో పడింది.

"లలితకు ఇష్టమేనా ఇంట్లో గొడవయినా?"

"అయ్యో దానికేం భయం మనూ, ఎదురుగా చెప్తోంది రవిని తప్ప వేరొకర్ని చేసుకోనని. మా పిన్ని మటుకు సంబంధాల వేటలో పడింది. సికిందరాబాదులో డాక్టర్గా ప్రాక్టీస్ పెట్టేడట. పిల్లవాడు లక్ష రూపాయల కట్నం అడిగినా సరే ఇవ్వడానికి సిద్ధంగా వున్నానని కబురు చేసింది. మా రామన్నయ్యని పోయి రమ్మంది. ఈయనకి పోవడం ఇష్టంలేక కుదరదని కబురు చేశాడు. మా నాన్న వెళ్ళేడట మరి. నాకు దిగులుగా వుంది మనూ. ఏం చేసేందుకు తోచక ఇక్కడికి వచ్చేను. లలితకు తెలియదు ఇంత దూరం వచ్చిందని. మా పిన్ని పట్టుదల గల మనిషి. బాబాయి పోయాక ఆడది ఒక్కతే నిలబడి చుట్టాల్ని కూడా చేరనీయకుండా అంత ఆస్తి కాపాడుకొంటూ వచ్చింది. ఇంత డబ్బున్న మనిషయినా, గొడుగు వేసుకొని పొలం పోతుంది అవసరం అయితే... రవికి, లలితకు ఇంత ఇష్టం అయాక ఈ పెళ్ళి జరగదా, ఇదే నా బాధ."

మనోరమ సంకోచాలన్నీ వదిలిపోయాయి రాజి దిగులుతో. నిజమే పరాయి పిల్ల రవి కోసం అంత దిగులుపడిందే. ఒక రక్తం పంచుకొని పుట్టేము. నేనెందుకు వాడి సంతోషం చూడకూడదు. మధ్యలో మాధవరావు ఇష్టమేమిటి? అంతగా అయితే పెళ్ళికి రాడు అంతే గదా. పిల్లల కోసం అమ్మ ఎలాగయినా సర్దుకొంటుంది. కాకపోతే, ధైర్యం లేదు ఆమెకు అనుకుంది.

"నాకూ ఇష్టమే" అంది నెమ్మదిగా.

రాజీ నవ్వుతూ చూచింది మనోరమ వేపు. ఈ ఇంట లలిత సుఖంగా వుంటుంది' అనుకొంది మనసులో.

❊ ❊ ❊

"రాజీ, మీరయినా చెప్పండే దానికి, ఇవాల్టికి భోజనం చేసి మూడు రోజులయింది. అలా మంచం కరుచుకొని పడుకొని వుంది. నన్నిలా సాధిస్తుందేమిటే ఇది. ఇవన్నీ చూడడానికే భగవంతుడు నన్నుంచేడు. ఈ పిల్లలతో నేనేం చేసేది భగవంతుడా..." ఏడుస్తోంది సుభద్రమ్మ.

వెంటనే బయలుదేరి రమ్మని మనిషిని పంపితే హడలిపోయింది రాజేశ్వరి. నవ్వుతూ వెళ్ళింది. లలిత ఈ విషయాలు తెలిసి ఏ అఘాయిత్యం అయినా చేయలేదు కదా, అసలే మొండి పిల్లలు వీళ్ళు... పిన్ని తక్కువది కాదు....

తలుచుకొంటేనే కాళ్ళు వణికిపోయాయి. ఇలా కబురు వచ్చిందని రవికి, రామకృష్ణకు కబురుచేసి ఆటోలో బయలుదేరి వచ్చింది రాజేశ్వరి. ఒక్క క్షణం ఆలస్యం చేసేందుకు కూడా మనసు ఒప్పలేదు.

మంచం మీద పడుకొని వుంది లలిత విపరీతమైన నీరసంతో. కళ్ళు మూతలుపడి పోయాయి ఆ అమ్మాయికి.

"లలితా..." నెమ్మదిగా పిలిచింది.

కళ్ళు తెరిచి చూచి నవ్వింది లలిత.

"ఏమిటీ ఈ అఘాయిత్యం లలితా. మూడు రోజులు మంచినీళ్ళు కూడా తాగకుండా ఎలా వుండగలిగేవు" కళ్ళనీళ్ళు తిరిగేయి రాజేశ్వరికి వాడిన ఆ పిల్లమొహం చూచేసరికి.

లలిత మాట్లాడలేదు. కళ్ళు మూసుకొంది.

❊ ❊ ❊

"అమ్మా! నేను లలిత వుండే వూరు వెడుతున్నాను...." అని హడావుడిగా లాకర్ తెరిచి డబ్బు తీసుకొంటున్నాడు. బియ్యం ఏరుతున్న యశోదమ్మ నిర్ఘాంతపోయి చూచింది.

"నీకింకా ఈ పిచ్చి వదల లేదుట్రా."

"బహుశా వదులుతుందేమో. లలితకు ప్రమాదంగా వుందిట" రవి గొంతు పదునుగా ధ్వనించింది. మనోరమ తెల్లబోయింది తమ్ముడి మొహం చూచి.

'ఏమయింది రవీ, లలితకేమయిందీ?" అన్నది దుఃఖం ఆపుకొని.

"ఏమో తెలియదు. నేను వెళ్ళాలి...."

ఒక్క క్షణంలో నిశ్చయం చేసుకొంది మనోరమ.

"నేనూ వస్తాను రవీ..." అన్నది. రవి ఆశ్చర్యంగా చూచేడు ఆమె వైపు.

కళ్ళు తుడుచుకొంటూ, జుత్తు, బొట్టు సవరించుకొంటున్నదామె బయటికి పోయేందుకు సిద్ధం అయిపోతూ.

"మనూ, నీకూ మతిపోయిందిటే. బావ వూరుకొంటాడటే మీరు ఇలా పెత్తనాలు చేస్తే. పెద్దా, చిన్నా వుండక్కర్లేదా?"

బేగ్ తీసి, హేండ్ కర్చీఫ్ వుందో లేదో చూచుకొంటూ, "బావకి వివరంగా ఉత్తరం రాశానమ్మా, నీకు ఇష్టమయితే రమ్మని. సంస్కారమున్న మనిషి అయితే వస్తాడు, లేకపోతే రాడు. పెళ్ళి రవి గదా చేసుకొనేది, అయినా, నా ధర్మం కొద్దీ ఉత్తరం రాసి తెలియచేశాను. అల్లుడంటే బెట్టుగా వుండాలన్న బడాయి కొద్దీ బిగుసుకొంటాడే కానీ, బావ మటుకు మనిషి కాదూ..."

యశోదమ్మకు కళ్ళనీళ్ళు తిరిగేయి.

చివరకు నన్ను చెడ్డదాన్ని చేశారు కదా మనూ. రవీ మీరు నలుగురిలో నగుబాట్లు అవుతారని, అందరితోపాటు ఏదో కులంలో పిల్లని చేసుకుంటే ఒకళ్ళ చేత వేలెత్తి చూపించుకోకుండా వుంటారని కానీ...." ఆవిడ గొంతు పూడిపోయింది. వాళ్ళిద్దరూ కలిసి తనను శత్రువుగా చూచేసరికి భరించలేకపోయిందావిడ.

"లలితకు ఏం ప్రమాదం జరగకుండా వుంటే, అప్పుడు చూద్దాం లేమ్మా..." ముభావంగా అన్నాడు రవి చెప్పులు వేసుకుంటూ. అతని వెనకే మనోరమ బయలుదేరి పోయింది.

'నేను ఒకనేళ మరీ మూర్ఖం పోయానా? ఈ పిల్ల ఏం అఘాయిత్యం చేసుకొన్నా ఆ భారం నెసు జీవిత కాలం మోయాల్సి వస్తుంది కదా? వాడి మనసుకి తగ్గట్టు నేనూ వూరుకుంటే బావుండేదేమో...' ఆమె ఆలోచనలో వుండగానే, బయట ఆటో ఆగింది. తొంగి చూచేసరికి మాధవరావు ఆటోకి ఛార్జి ఇస్తున్నాడు. ఆవిడ నోరు తెరిచింది ఆశ్చర్యంతో. ఈ పిల్లవాడూ వచ్చేడే అని. మాధవరావు యశోదమ్మని చూచి చిరునవ్వు నవ్వేడు.

"ఏమండీ, ఏడీ, పెండ్లి కొడుకు?"

అల్లుడు ఇంత సరసంగా, స్వేచ్ఛగా నవ్వడం చూచి ముక్కున వేలేసుకొంది ఆవిడ.

* * *

దడదడమని శబ్దం చేస్తూ, ఆటో ముందుకి వెళుతోంది. రివ్వున వీస్తోంది గాలి. రవి మౌనం భరించలేనిదిగా వుంది మనోరమకి. ఎప్పుడు సరదాగా వుండే రవి ముభావంగా సర్వం కోల్పోయిన మనిషిలా వున్నాడు.

"ఏమిటే అమ్మాయ్ పలకడం లేదూ... లలితా.... లలితా" ఆందోళనగా కేకలు పెట్టింది సుభద్రమ్మ. తోటకూర కాడలా వేలాడిపోతోంది లలిత.

"ఆచార్యులు గారినయినా పిలుచుకురండే..."

కొంచెం గ్లూకోజు నీళ్లు తెచ్చినా, లలిత చెంచానీళ్ళయినా గుటక వేయలేదు. గంటసేపయి బ్రతిమలాడినా. ఆవిడ హడలిపోతోంది. లలిత మరీ ఇంత మొండితనం చేస్తుందనుకోలేదు.

ఆచార్యులుగారు వచ్చి ఒక గ్లూకోజు ఇంజక్షన్ ఇచ్చేరు ముందుగా. కళ్ళు తెరిచి చూచింది లలిత.

"ఏవమ్మా లలితా... ఎందుకీ నిరాహార దీక్ష...." ఆచార్యులుగారు నవ్వేరు.

"అయ్యో ప్రారబ్ధం బాబాయి, ఏం చెప్పమంటావూ? నీ కూతురిలాంటి దాన్ని. కడుపుచించుకుంటే కాళ్ళమీద పడుతుందని నోరు నొక్కుకున్నా, సోమయాజి మా తాత. మెట్టినింటి సంగతి వేరే చెప్పేదేముంది? సంధ్యా వందనాలు, సూర్య నమస్కారాలు, మడి కట్టుకోవడం లోనే జీవితాలు వెళ్ళమారిపోతే, ఈ నాటికి ఈ పిల్ల వర్ణ సంకరం చేస్తానంటుందేవండి. శాఖాంతరమైతేనే పనికి రాదంటామే... ఏం చెయ్యమంటావు బాబాయి..."

ఏడుస్తోంది ఆవిడ. కన్నబిడ్డ మీద మమకారం ఒకవేపు, నలుగురిలో తలెత్తుకు తిరగలేననే భయం ఒక వేపు ఆమెను పిచ్చిదాన్ని చేస్తున్నాయి. ఆచార్యులుగారు చిరునవ్వు నవ్వేరు. అనుభవంతో, పండిపోయిన మొహంలో చిన్న విచార రేఖ వుంది.

"ముప్పొద్దులా దేవుడి గుళ్ళోనూ, జీవితమంతా దేవతార్చనలోనూ గడిచిపోయింది. ప్రతిగా నాకు గోపాలుడు ప్రసాదించిందీ కీళ్ళవాతం. చిన్నప్పుడే భర్తను పోగొట్టుకొని పంచజేరిన కూతురు. కులాంతర మంటావే సుభద్రా నీ గోపాలుడు ఏ కులం? శ్మశాన నివాసి శివుడిది ఏ కులం. ఎందుకొచ్చిన ధర్మాలివి. చిన్నమాట చెప్పేదా తల్లీ. చిన్నప్పుడే తల చెడిందని మూల కూర్చోబెట్టకుండా మా భవానికి

పెళ్ళిచేసి వుంటే ఇవాళ అది నా గుండెలమీద కుంపటిలాగా కాకుండా అన్నదమ్ముల ఇంట వంట మనిషిగా కాక ఒక మనిషిగా బ్రతికేది కదా అని ఇప్పుడు నా దిగులు. ఇప్పుడు భవానికి నలభై దాటుతున్నాయి. ఏం చేయగలను దానికోసం... వ్యర్థమయిన ఆచారాలతో దాన్ని అన్యాయం చేశాననిపిస్తుంది ఒకోసారి. రోజులు మారుతున్నాయి, వాటితో పాటు మనమూ మారాలి కదా. ఈ పిల్ల ఇవాళ ఇంత పట్టుదలతో వుందంటే నువ్వింకా కులాంతరమంటూ పట్టుబట్టటం ఎంతవరకు సబబో ఆలోచించు."

"నీలా అందరూ ఆలోచిస్తారా బాబాయి, తలా ఒక మాట అనరూ...."

"ఎందుకనరూ, అంటారు. ప్రవహం అనుకో జీవితం. పాతనీరు వెళ్ళిపోయి క్రొత్తనీరు వస్తోంది. మనకా పాతనీరే కావాలంటే దొరుకుతాయా. మన అవసరాల కోసం పద్ధతులు ఎన్నో మార్చుకోలేదూ? ఇదీ అలాగే అవుతుంది. మా రెండోవాడు విశ్వనాథ శర్మ తెలుసుగా, ఏరికోరి వాడి కొడుక్కి సాంప్రదాయాను సారంగా, జాగ్రత్తగా చూసి మరీ పెళ్ళి చేశాం. ఏమయింది? మొగుడూ, పెళ్లాలిద్దరూ కోర్టు కెక్కారు. ఒకళ్ళనొకళ్ళు నువ్వు మంచిదానివి కాదంటే, నువ్వు మంచివాడివి కావని ఆధారాలతో సహా కోర్టుకెక్కారు. కుర్రవాడు ముందు నుంచీ గొడవ పెడుతూనే వున్నాడు. చదువుకున్న పిల్ల కావాలి, నాతోపాటు వుద్యోగం చేస్తే హాయిగా బతుకుతానని. మేం విన్నామా? సాంప్రదాయం బావుందీ, పిల్ల తీరుగా వుండి పని పాట్లు చేస్తుందని మూర్ఖించలేదూ. ఇవాళ అంతా మొర్రోమని ఏడుస్తున్నాం, జరిగిన గొడవకు ఇంకా ఏం ఆలోచన వద్దు నీకు...."

సుభద్రమ్మ కళ్ళు తుడుచుకొని ఆయన వేపు చూచింది.

* * *

"రవీ" అన్నది నెమ్మదిగా మనోరమ.

తల తిప్పి అక్కవేపు చూచేడు రవి.

"నువ్వు అలా బాధపడకురా, లలితకు ఏం జరగదు. నేను వాళ్ళ అమ్మగారిని అడుగుతాను ఈవేళ. లలిత మాకు కావాలని... అదే మా ఇంటికి రావాలని"

చిత్రంగా చూచేడు ఆమె వేపు రవి.

"చిన్న పాపాయిని ఎత్తుకొనే ధైర్యం లేదుగానీ లలితను మనింటికి తీసుకు పోతావేం నువ్వు. బావగారు, అత్తగారు చివరకు అమ్మ వాళ్ళంతా వప్పుకోవద్దూ... చూడు మన జీవితం మన చేతుల్లో వుండదు. అంతే. నీకు నిజంగా మనసుంటే వూరికినే వ్యర్థంగా ఏడిచావుగానీ పాపాయిని తెచ్చుకోలేదేం?" ప్రశ్నవేశాడు రవి.

తల వంచుకొంది మనోరమ. ముత్యంలాటి కన్నీటిబొట్టు జారి ఒడిలో పడింది.

"రవీ, నీకు తెలియదు, ఆడది ఎంత అస్వతంత్రురాలో నీవు ఊహించలేవు. పితృదండనా, భర్తదండనా, పుత్ర దండనా అంటారే ఈ రోజుల్లో కూడా ఇన్ని దండనలకు లోబడే వుంది స్త్రీ జీవితం. పాపాయిని తీసుకొనే నిర్ణయం నా ఒక్కదానిదేనా? నువ్వు ఆలోచించు....ఏం చేయలేని స్థితిలో ఎంత పిచ్చిదానిలాగా ప్రవర్తించానో చూచేవుగా..."

దుఃఖంతో గొంతు జీరబోయింది మనోరమకు.

రవికి జాలేసింది. తను కఠినంగా మాట్లాడానని ఓదార్పుగా మనోరమ చేతి మీద చేయి వేశాడు.

❊ ❊ ❊

"కుర్రవాడు బుద్ధిమంతుడేనా?" అన్నాడు ఆచార్యులుగారు.

"పిల్లాడికేం, రావుడితో స్నేహం. వాళ్ళ ఇంట్లో పిల్లవాడిలాగే వుంటాడట. మంచి వుద్యోగమే వుంది. ఏమంత కలిగిన వాళ్ళు కాదు. ఆ పిల్లవాడికొచ్చే ఐదు వందలే ఆధారం. ఈ గొడవ వాళ్ళ వాళ్ళకి ఇష్టం లేదట. పైగా రాత్రిపూట ఏదో కాలేజీలో చదివి ఎమ్.ఎ. చేస్తున్నాడట. ఏమిటో ఆ కులం పట్టింపు లేకపోయినట్లయితే నాకీ దిగులు వుండేది కాదు.

"నువ్వు ఆలోచించుకో. పెద్ద సంబంధం, వుద్యోగస్తుడికివ్వాలి అని నీ వుద్దేశ్యం. తీరా పెళ్ళి చేశాక వాళ్ళ దారి వాళ్ళదే అవుతుంది. కానీ, నీకేం అండ వాళ్ళ వల్ల. నీకూ ఇద్దరు చిన్న పిల్లలు వున్నారు. పిల్లదాన్ని ఇష్టపడ్డాడు. నీకూ అండవుతారు ఇద్దరూ. దగ్గరలో వుంటారు. కులాల సంగతి మరిచిపో. ఏమిటీ బ్రాహ్మడు ఇలా చెపుతున్నాడు అనుకోకు. నీకు సంఘ భయం నాకు అనుభవం. జీవితం నేర్పిన పాఠం. ఏ పిల్లను చూచినా, నాకు నా భవాని గుర్తు వస్తుంది. 'నేనే గనక ధైర్యం చేసి వుంటే ఇవాళ దాని కా గతి వుండదు కదా అని ఆవేదన. అనాచారం అయింది నా పాలిట మన ఆచారం"

దీర్ఘంగా నిట్టూర్చి లేచారు ఆచార్యులుగారు.

సుభద్రమ్మ పడి వున్న లలిత వైపు చూచింది. కళ్ళకు చేయి అడ్డు పెట్టుకొని పడి వుంది.

"లలితా..."

గుమ్మం రెండు చేతులతో పట్టుకొని రవి నిలుచుని వున్నాడు. తల చెదిరిపోయి వుంది. మొదటిసారిగా 'లలితా' అని ప్రేమగా పిలిచిన రవి వేపు ఆప్యాయంగా చూచింది సుభద్రమ్మ. వూరుకాని వూరు, పల్లెటూరనీ సందేహించకుండా ఈ పిల్లవాడు ఇంత దూరం పరిగెత్తుకొని వచ్చాడు...

నాగస్వరం విన్న పాములాగా లేచింది లలిత.

'రవీ' అంది బలహీనంగా. లేచిన వూపుకే తూలిపోయింది.

'లలితా' రవి చిన్న అంగలో ఆమెను పడిపోకుండా చేయి చాపి పడుకోబెట్టాడు.

'రవీ' అంటూ లలిత పిలిచాక అతనికి సంకోచం అంతా వదిలిపోయింది. 'లలిత క్షేమంగానే వుంది' ఆ భావనే అతనికి బలాన్ని ఇచ్చింది. సుభద్రమ్మ గారికి రెండు చేతులు జోడించి నమస్కారం చేశాడు అతను.

"క్షమించండి. మీకు కోపం వస్తుందని తెలుసు. అయినా లలితకు ఏదైనా ప్రమాదం జరిగిందేమోనన్న భయం నన్నింతదూరం లాక్కు వచ్చింది. వదిన కోసం అర్జంటుగా కబురు వచ్చిందని తెలిసేసరికి మనసు కీడునే శంకించింది. అందుకే... నన్ను క్షమించండి మీరు..."

మనోరమ అప్పటికే లలిత దగ్గర కూర్చుంది. ఇద్దరూ ఎంతో పరిచయం వున్న వాళ్ళలా కళ్ళతోనే పలకరించుకున్నారు. సుభద్రమ్మకు ఏం చెప్పాలో తోచటం లేదు. సంతోషమో, బాధో తెలియని భావం ఆమె మొహంలో కనబడుతోంది. ఆచార్యులు గారి వేపు చూచింది.

ఆయనా ఆమె వేపే చూస్తున్నారు. 'చూడవమ్మా వాళ్ళని. వాళ్ళని విడదీసే హక్కు నీకుందా' అంటున్నాయి ఆయన కళ్ళు.

*　　*　　*

"పెళ్ళయినా మా ఇష్టం వచ్చినట్లు చేసుకోకూడదురా రవీ,  వీడెప్పుడు ఇంతేనే మనో... పదిమందికి భోజనం పెట్టకుండా సత్యన్నారాయణ స్వామికి వ్రతం చేయకుండా ఒక వారం లేదు, మంచి రోజు లేదు.... ఇలాటి పిల్లవాడిని నేను ఎక్కడా చూడలేదమ్మా."

"నువ్వు కాస్త చెప్పకూడదోయ్ మాధవా, నీ మాట వాడు కాదంటాడా?"

తల్లి మాటలు వినకుండా పుస్తకంలో తల దూర్చి మనోరమ కూర్చున్నా, సానుభూతిగా అత్తగారి స్వగతంలో కూడిన వుపన్యాసం వింటున్న మాధవరావు గాలి తన మీదకు వీచేసరికి వులిక్కిపడ్డాడు.

"అబ్బే..... లాభం లేదులే అత్తయ్యా.... ఈ లెక్కన చూస్తే నా పెళ్ళికి ఖర్చు పెట్టిందంతా నష్టమే కదా, మనకూ ఇల్లాంటి అయిడియా వచ్చి వుంటే బావుండేదే అని నేను ఆలోచిస్తుంటే..."

"పెళ్ళికి పెట్టింది ఖర్చేమిటోయ్, ఈ రవి గాడికన్నీ తల తిక్క ఆలోచనలని నేను ఏడుస్తుంటే..."

"అదంతే అత్తయ్యా.... రవి చాలా మంచి ఆలోచన చేశాడు"

"మిమ్మల్ని ఇప్పుడు మటుకు 'బావా' అనబుద్ధి వేస్తుంది బావా. ఇకపైన నిన్ను జి.యమ్. అని పిలవనని హామీ ఇస్తున్నాను" అన్నాడు రవి నవ్వుతూ.

నేనెప్పుడూ ఒకలాగే వున్నానోయ్, నన్ను మీరు అపార్థం చేసుకొన్నారు. అత్తయ్యతో మాట్లాడదామా లాభం లేదు. మనో సంగతి తెలిసిందే కదా. మనం ఛాటర్ బాక్స్‌లాగా వాగినా, చిరునవ్వే తప్ప మాట్లాడని మల్లె మొగ్గ. ఇక నీతో కుర్రాడితో నాకేం మాటలుంటాయి చెప్పు. నేనటు సీరియస్‌గా వుండలేక, ఇటు కుర్రతనంగా అత్తయ్య ముందు తేలిపోకుండా వుండలేక ఎంత అవస్థపడ్డానో నాకే తెలుసు. ఇంటి అల్లుడి పాత్ర పోషణ చాలా క్రిటికల్. ఏ మాత్రం వెయిట్ పోయినా, బావుండదని మనం కొంచెం బిగుసుకుని వుంటాం. నువ్వూ ఒక ఇంటి అల్లుడివే కదా. నీకు మాత్రం అనుభవంలోకి రాదూ" నవ్వేడు మాధవరావు.

"అంతేగా మరి" కాలర్ ఎగరవేస్తూ మనోరమ ప్రక్కన చేరిన లలితవైపు చూశాడు రవి నవ్వుతూ.

లలిత అతని వేపే కళ్ళెత్తి చూస్తోంది.

రేడియోలో లలిత సంగీతం వస్తోంది.

కన్నె కాటుక కళ్ళు
చిన్ని నాథుని చూచి
కదులు లాడిన వేళ
ఆకాశ మధ్యాన
ఆటనొక్క తెలిమబ్బు
మెరుపులా మెరిసిందిలే...

లలిత సిగ్గుగా నవ్వుతోంది.

ఇది నవతరం. వాళ్ళంతా నవ్వేందుకే పుట్టారు. ఎదురుగా గోడమీద పూల దండలతో అలంకరించబడిన ఫోటోల్లోంచి వీరేశలింగం పంతులుగారు, గురజాడ వారూ..... వాళ్ళిద్దరినీ ఆశీర్వదిస్తున్నట్టున్నారు ✻

*'వనితాజ్యోతి' జన్మదిన ప్రత్యేక సంచిక 1987*

